జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





కృష్ణ మంగళవారం 25 ఆగస్టు 2026 సంపుటి : 01 సంచిక :222 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే గుర్తొచ్చేది ముసునూరే

- నూతన పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు
- కాట్రేనిపాడులో గోర్మే పాప్ కార్నికా సంస్థ ఆధ్వర్యంలో మట్నక్కజొన్న సీడ్ ఆవిష్కరణ
- గత 11 ఏళ్లలో పాప్‌కార్న్ మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65 శాతానికి పెరగడం విశేషం
- ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి పాప్‌కార్న్‌ను ఎగుమతి చేసే బాధ్యతను తీసుకోవాలి
- “మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది
- అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది.



**అమరావతి**

భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే ముసునూరు గుర్తొస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏలూరు జిల్లా కాట్రేనిపాడులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కలసి నూతన పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ మార్కెట్‌లోకి తీసుకెళ్లే ఉత్పత్తికి ఎన్నో రెట్లు విలువ పెరుగుతుందని పేర్కొన్నారు. అందుకే ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, స్వదేశీ విధానాలతో స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లలో పాప్‌కార్న్ మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65 శాతానికి పెరగడం విశేషమన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి పాప్‌కార్న్‌ను ఎగుమతి చేసే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. రవాణా సౌకర్యాలపై రైల్వే మంత్రితో మాట్లాడతానని ఉపరాష్ట్రపతి హామీ ఇచ్చారని తెలిపారు. ముసునూరు పాప్‌కార్న్‌తో పాటు అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా చేపట్టడం వల్లే తక్కువ కాలంలో ఈ విజయం సాధ్యమైందని సీఎం చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్న సాగు చేస్తున్నారని వివరించారు. కేవలం 11 ఏళ్లలో 8 రాష్ట్రాలకు విస్తరించడం చిన్న - మిగతా3లో



## జంతర్ మంతర్ ప్రొటెస్ట్

- మహిళా నిరసనకారుల ఫిర్యాదులకే మొదటి ప్రాధాన్యత: సుప్రీంకోర్టు
- జంతర్ మంతర్ నిరసనలు
- మహిళల ఫిర్యాదులకే మొదటి ప్రధాన్యత ఇవ్వాలని విచారణ కమిటీకి సీజేఐ ఆదేశం



## భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?

- రాహుల్‌పై సీఎం యోగి ఫైర్
- రాహుల్ గాంధీపై యోగి ఆదిత్యనాథ్ ఘాటు విమర్శలు
- మనుస్మృతిపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన యూపీ సీఎం
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి భారత సంప్రదాయాలను అవమానిస్తున్నారని ఆరోపణ


## కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు

- ట్రంప్ సంచలన నిర్ణయం
- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమలు
- కెనడా వల్లే తమకు వాణిజ్య లోటు వస్తోందన్న ట్రంప్
- అమెరికా నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా సిద్ధం



## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- పులివెందుల దాహార్తికి శాశ్వత పరిష్కారం: పవన్ కల్యాణ్
- జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పనులకు వేగం
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులకు తిరిగి ప్రాణం
- పులివెందులలో రికార్డు స్థాయిలో 96 శాతం పనులు పూర్తి



**అమరావతి**

దశాబ్దాలుగా నెలకొన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజకీయాలకు అతీతంగా ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా ‘జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార’ ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తోంది. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పనులను తిరిగి ప్రారంభించి రికార్డు వేగంతో పూర్తి చేస్తోంది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ఏకంగా 96 శాతం పనులు పూర్తి చేసినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ఏడు మండలాల పరిధిలో సుమారు ఐదున్నర లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరి దాహార్తిని తీర్చే లక్ష్యంతో ‘పులివెందుల మెగా వాటర్ గ్రిడ్’ పథకానికి గతంలో రూపకల్పన చేశారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద రూ. 480 కోట్ల అంచనా - మిగతా3లో

## స్థానిక పోరుకు రంగం సిద్ధం



- స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం
- ఇలాంటివి నమ్మొద్దు: ఎస్ఈసీ పునేఠా
- అధికారిక ప్రభుత్వ గుర్తులను సైతం దుర్వినియోగం చేస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారు
- ఆ వార్తలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దు
- ప్రకటనలో తెలిపిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్‌చంద్రపునేఠా

**అమరావతి**

రాష్ట్రంలో జరగనున్న గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న షెడ్యూల్ పూర్తిగా నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్‌చంద్రపునేఠా స్పష్టం చేశారు. అధికారిక ప్రభుత్వ గుర్తులను సైతం దుర్వినియోగం చేస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారని, ఆ వార్తలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఎన్నికల తేదీలు, షెడ్యూల్ నిజమేనా అంటూ వివరణ కోరుతూ కమిషన్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ఫోన్ కాల్స్ వస్తున్నాయని అనీల్‌చంద్రపునేఠా గుర్తు చేశారు. ప్రచారంలో ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని, ఎలాంటి ధ్రువీకరణ లేని ఇటువంటి వార్తలను ఇతరులకు ఫార్వార్డ్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించి, ప్రజలను గందరగోళానికి గురి చేసే వారిపై సైబర్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఏ విధమైన అధికారిక - మిగతా3లో

## ఎల్‌నినో దృష్ట్యా కృష్ణా జలాలను తాగునీటికే వాడుకోవాలి

- సూత్రప్రాయంగా నిర్ణయించిన కేఆర్ఎంబీ
- హైదరాబాద్‌లో ముగిసిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం
- ఈ ఏడాది నీటి పంపకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోని కమిటీ
- మళ్లీ సెప్టెంబర్ 4న భేటీ కావాలని కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నిర్ణయం
- కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం నిర్ణయాలు



# విద్యార్థులను ప్రోత్సహించేందుకే విద్యా చక్రం ద్వారా సైకిళ్లు అందిస్తున్నాం.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు





## పేదరికం విద్యకు అడ్డంకి కాకూడదు ఎమ్మెల్యే అమిలినే

**కంబదూరు ఆగస్టు 24:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి, పేదరికం వారి చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో సైకిళ్లు అందిస్తున్నామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. కంబదూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం 'అమిలినేని విద్యాచక్రం' కార్యక్రమంలో ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు.

**12 గంటల్లోనే రూ.5 లక్షల పరిహారం**

కంబదూరులో పాత గోడ కూలి విద్యార్థి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించడంతో 12 గంటల్లోనే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**రూ.5 కోట్లతో 7,300 సైకిళ్లు**

ఎస్సార్సీ సంస్థ సహకారంతో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో 7,300 సైకిళ్లను విద్యార్థులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. లకంబదూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేయడంతో పాటు అదనపు మరుగుదొడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి, గాజుల శ్రీరాములు, మండల కన్వీనర్ శివన్న, తలారి ఎర్రిస్వామి, మారుతి, ఎంఈఓ ఉమాపతి, హెచ్ఎం అమర్‌నాథ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.63 లక్షల టోకరా

## 17 రాష్ట్రాల్లో సైబర్ వేట- 12 మంది అరెస్ట్

డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రజలను భయపెట్టి లక్షల రూపాయలు దోచుకుంటున్న అంతరాష్ట్ర సైబర్? ముఠా గుట్టును మధ్యప్రదేశ్? పోలీసులు రట్టు చేశారు. దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లోని 33 జిల్లాల్లో పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఆపరేషన్?లో 12 మంది సైబర్? నేరగాళ్లను అరెస్ట్ చేశారు. దేవాస్?కు చెందిన ఓ ఓ రిటైర్డ్ ఉద్యోగిని మోసం చేసి ఏకంగా రూ.63 లక్షలు దోచుకున్నారు. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు సైబర్ ముఠాను ఛేదించారు.

దేవాస్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి సురేశ్ ఇంగ్లేకు ఈ ఏడాది మార్చిలో కొందరు వ్యక్తులు ఫోన్ చేశారు. అనంతరం వీడియో కాల్స్ చేసి తాము కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ శాఖ, ముంబయి క్రైమ్ బ్రాంచ్, సీబీఐ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. ఓ మనీలాండరింగ్ కేసులో తన పేరు ఉందని, అరెస్టు తప్పదని బెదిరించారు. దీంతో బాధితుడు తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. కేసు నుంచి బయటపడాలంటే దర్యాప్తులో భాగంగా తన బ్యాంకు ఖాతాలు, పెట్టుబడుల వివరాలు చెప్పాలని నిందితులు ఒత్తిడి చేశారు. సుమారు ఎనిమిది రోజుల పాటు అతడిని మానసికంగా వేధిస్తూ, వివిధ బ్యాంకు ఖాతాలకు డబ్బులు బదిలీ చేయించారు. ఇలా దశలవారీగా సుమారు రూ.63 లక్షలను కొల్లగొట్టారు.

**ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు**

దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన సురేశ్ ఇంగ్లే ఏప్రిల్ 3న సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన దేవాస్ పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరుసటి రోజు నుంచే ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు, లావాదేవీలను పోలీసులు సాంకేతికంగా విశ్లేషించారు. డబ్బులు ఏయే ఖాతాలకు బదిలీ అయ్యాయి? ఆ ఖాతాలను ఎవరు నిర్వహిస్తున్నారు? నగదు ఎక్కడికి చేరుతోంది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో మోసానికి పాల్పడిన వ్యక్తులు ఒక్క రాష్ట్రానికి పరిమితం కాలేదని తేలింది.

**127 రోజుల ఆపరేషన్- 17 రాష్ట్రాల్లో వేట**

అంతర్రాష్ట్ర సైబర్ నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు దేవాస్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 127 రోజుల



పాటు 70 మంది పోలీసులతో 19 ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేశాయి. సాంకేతిక ఆధారాలను అనుసరిస్తూ నిందితుల కదలికలను గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో పోలీసు బృందాలు సుమారు 58,315 కిలోమీటర్లు ప్రయాణించాయి. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, బిహార్‌తో పాటు మొత్తం 17 రాష్ట్రాల్లోని 33 జిల్లాల్లో దాడులు నిర్వహించారు. చివరకు 12 మంది సైబర్ నేరగాళ్లను అదుపులోకి తీసుకున్నారు.

**రూ.54.84 లక్షల నగదు స్వాధీనం**

ఈ కేసులో నిందితుల నుంచి పోలీసులు రూ.54.84 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన 12 మందిలో 11 మందిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. బంగాల్?కు చెందిన కమల్‌కాంతిని మాత్రం పోలీసులు తమ అదుపులోకి తీసుకుని మరింత విచారిస్తున్నారు. ఈ ముఠా కార్యకలాపాల వెనుక మరికొందరు ఉన్నారా? దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి మోసాలకు పాల్పడ్డారా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, నగదు లావాదేవీల ఆధారంగా నెట్‌వర్క్‌లోని ఇతర వ్యక్తులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

**డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరిస్తే నమ్మొద్దు**

కేసు వివరాలను దేవాస్ ఎస్పీ పునీత్ గెహ్లోత్ మీడియాకు వెల్లడించారు. డిజిటల్ అరెస్ట్ అంటూ పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు ఎవరినీ వీడియో కాల్‌లో నిర్బంధించవని ఆయన స్పష్టం చేశారు. అధికారుల పేరుతో ఫోన్ లేదా వీడియో కాల్ చేసి కేసులో ఇరికిస్తామని, అరెస్టు చేస్తామని బెదిరిస్తూ డబ్బులు అడిగితే అది సైబర్ మోసంగా భావించాలని సూచించారు. తెలియని వ్యక్తులు పోలీసు, సీబీఐ, క్రైమ్ బ్రాంచ్, టెలికమ్యూనికేషన్ శాఖ వంటి సంస్థల పేర్లు చెప్పినా వెంటనే నమ్మొద్దని పోలీసులు హెచ్చరించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ భయపడి డబ్బులు బదిలీ చేయకూడదని తెలిపారు. అనుమానం వచ్చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సైబర్ మోసానికి గురైతే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

# పండుగ వేళ చక్కెర ధరల మంట- కృత్రిమ కొరత సృష్టించడమే కారణమా?

చక్కెర ధరలు ఆకాశాన్నంటడంతో ఈ ఏడాది పండుగ సీజన్ చేదు అనుభవాన్ని మిగుల్చుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2వారాల వ్యవధిలోనే కిలో చక్కెర ధర రూ.20 వరకు పెరిగింది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కిలో చక్కెర ధర రూ.65నుంచి రూ.70కు చేరింది. ఈ పరిణామాల నేపథ్యంలో చక్కెర ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. దేశీయంగా తగినంత మేర చక్కెర నిల్వలు ఉన్నప్పటికీ, పరిశ్రమ వర్గాలే కృత్రిమ కొరత సృష్టించి, ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని ప్రభుత్వవర్గాలు అంటున్నాయి. పండుగల సీజన్ ఆరంభంలో చక్కెర ధరలు అమాంతం పెరగటంతో అటు ప్రజలు ఇటు చిన్నవ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పండుగల సీజన్ మిఠాయిలు తప్పనిసరి కావటంతో చక్కెరకు డిమాండ్ పెరిగి వాటి ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం పలుచర్యలు చేపట్టినప్పటికీ, ఇప్పటికిప్పుడు చక్కెరధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపారవర్గాలు అంటున్నాయి. చక్కెర ధరలు పెరగటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆహార పదార్థాల ధరలు నిరంతరంగా పెరుగుతుండటం కుటుంబ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు వినియోగదారులు అంటున్నారు.

**చిన్న వ్యాపారులపై పెరుగుతున్న భారం**

పండుగల సీజన్‌లోనే చక్కెర ధరలు పెరగటంపై చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా పాత ధరలకే విక్రయించడం వల్ల తాము



నష్టపోతున్నామని వ్యాపారులు అంటున్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడం వల్లే ధరలు పెరుగుతున్నాయనే వాదనలను ప్రభుత్వం తిరస్కరించింది. దేశీయ అవసరాలను తీర్చేందుకు తగినంత నిల్వలు ఉన్నప్పటికీ, పరిశ్రమవర్గాలే కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరుగుదలకు కారణమవుతున్నాయని ప్రభుత్వం ఆరోపించింది.

**తగ్గిన చక్కెర ఉత్పత్తి**

2025-26మార్కెటింగ్ సంవత్సరానికి చక్కెర ఉత్పత్తి 306లక్షల టన్నులకు పడిపోయిందని ప్రభుత్వం తెలిపింది. చెరుకు పంటకు చీడపీడలు, విపరీతమైన వర్షాలతో నీరు నిలిచిపోవడం వంటి కారణాల వల్ల ఉత్పత్తి, మునుపటి అంచనా 343లక్షల టన్నుల నుంచి తగ్గింది. చక్కెర మార్కెటింగ్ సంవత్సరం అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది. దేశీయ డిమాండ్ దాదాపు 290లక్షల టన్నులు ఉందన్నారు. ఉత్పత్తి పడిపోయినప్పటికీ దేశీయ అవసరాలకు మించి చక్కెర ఉత్పత్తి జరుగుతోందని వ్యాపార రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, పండుగ డిమాండ్ కారణంగా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

**10 లక్షల టన్నుల చక్కెర దిగుమతులు**

అక్టోబర్ 31నాటికి 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతులను అనుమతించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఓపెన్ మార్కెట్‌లో మరింత చక్కెర అందుబాటులో ఉండేలా సాఫ్ట్ డ్రింక్, ఐస్‌క్రీమ్ తయారీదారుల వంటి డీలర్లు, బల్క్ కన్స్యూమర్లకు స్టాక్-హోల్డింగ్ పరిమితులను కూడా కఠినతరం చేయనున్నట్లు తెలిపింది. సాధారణంగా ఏడాదిలో అత్యంత తీయగా గడిచే ఈ పండుగ సమయం ప్రస్తుతానికి వినియోగదారులకు ఒక చేదు అనుభవంతో మొదలవుతోంది. సాధారణంగా భారత్‌లో ఏటా 28 నుంచి 29 మిలియన్ టన్నుల చక్కెర వినియోగం ఉంటుంది. ప్రస్తుతానికి అక్టోబరులో కొత్త చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. పండగల సీజన్‌లో ఇబ్బంది లేకుండా, సరఫరాను మరింత పెంచేందుకు రాష్ట్రాలు, చక్కెర మిల్లులు అక్టోబర్ 15 నుంచే క్రషింగ్ (చెరకు నుంచి చక్కెర, బెల్లం తయారు చేయడం) ప్రారంభించాలని కేంద్రం సూచించింది. దీని వల్ల అక్టోబరులో సాధారణంగా ఉత్పత్తి అయ్యే 3-4 లక్షల టన్నులతో పోలిస్తే 10 లక్షల టన్నులకుపైగా చక్కెర ఉత్పత్తి కావొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీంతో పండగల సమయంలో మార్కెట్లో సరఫరా పెరిగి, ధరలపై ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉందని భావిస్తోంది.

## రెండు నూతన బోర్లతో తాగునీటి సమస్యకు పరిష్కారం-టీడీపీ నాయకులు



**నందవరం, ఆగస్టు 24(ప్రజాజ్యోతి):** ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి సహకారంతో నందవరం మండలం ముగతి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు నూతన బోర్లు వేయించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రెండు బోర్లు వేయించడంతో తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బద్వేలులో చికెన్ షాపుల యజమానులకు పోలీసుల కౌన్సెలింగ్



**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** స్థానిక ఫోర్ రోడ్స్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న చికెన్ షాపుల యజమానులకు బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చికెన్ షాపుల ముందు కస్టమర్లు తమ బైక్‌లు, ఆటోలను రోడ్డుపైనే నిలపడం వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సీఐ వారి దృష్టికి తీసుకెళ్లారు.ఇకపై షాపుల ముందు వాహనాలను రోడ్డుపై నిలపకుండా, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులను ఆదేశించారు. ఇదే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, రోడ్లపై న్యూసెన్స్‌కు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణ హెచ్చరించారు.

## "తుప్పుపట్టిన బోర్డు, శిథిలమైన జనరేటర్ రాయచోటి పోస్టాఫీస్ దుస్థితి"




**రాయచోటి ఆగస్టు 24 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలంలోని తపాలా కార్యాలయం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రభుత్వ సేవలను నిరంతరం అందిస్తున్న ఈ కేంద్రం ఇప్పుడు అనేక సమస్యలతో సతమతమవుతోంది.కొత్తపేట నుండి ఎస్.ఎన్ కాలనీ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయబడిన ఈ తపాలా కార్యాలయం ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. సేవల కోసం వచ్చే ప్రజలు తమ వాహనాలను కార్యాలయం ఎదురుగా నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.ప్రస్తుతం రాయచోటి తపాలా కార్యాలయం చిన్న అద్దె భవనంలో నడుస్తోంది. స్థలం సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న భవనంలోనే ఆధార్ సెంటర్ ను కూడా నడుపుతుండటంతో రద్దీ మరింత పెరిగింది. అంతేకాకుండా కార్యాలయానికి చెందిన జనరేటర్ శిథిలావస్థకు చేరుకుంది. బోర్డు కూడా తుప్పుపట్టి ఉంది.ఈ సమస్యలను పరిష్కరించి, సొంత భవనంలో విశాలమైన స్థలంలో తపాలా సేవలు అందించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే 'జ్ఞానజ్యోతి'



**దువ్వూరు,ఆగస్టు24( ప్రజా జ్యోతి )** దువ్వూరు జడ్పీ హైస్కూల్ లో ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన "జ్ఞానజ్యోతి" అంగన్వాడీ టీచర్ల ఐదవ రోజు శిక్షణ కార్యక్రమంలో పిల్లల రక్షణ మరియు సంరక్షణ మార్గదర్శకాల గురించి, పిల్లల భద్రత విషయంలో మూల స్తంభాల గురించి, ఎన్సిప్ -ఎఫ్ఎస్ 2022 మార్గదర్శకాల గురించి, డిజిటల్ భద్రత మరియు అసాధారణ ప్రవర్తనలు మరియు సంకేతాల గురించి, లింగ వివక్షత, లింగ సమానత్వముల గురించి డిఆర్పీ లు చాలా చక్కగా శిక్షణ ఇవ్వడమైనది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖ అధికారి రమణయ్య, చాపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ ముంతాజ్ బేగం,ప్రథం నుండి కోఆర్డినేటర్ స్వరూప హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు చిన్నారుల ప్రాథమిక విద్య, భాషా వికాసం, మానసిక--శారీరక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. శిక్షణలో అందించే ఆధునిక బోధనా పద్ధతులు, ఆటల ద్వారా అభ్యసనం, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను అంగన్వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఆ గ్రామంలో ఉన్నటువంటి తల్లిదండ్రులకు అందరికీ వారి పిల్లల యొక్క భవిష్యత్తు ఎలా ఉంటుంది అనేది తల్లిదండ్రులకు అందరికీ అవగాహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేశారు.శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణ బృందం ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, ప్రాక్టికల్ కార్యకలాపాలు మరియు వినూత్న బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు.చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే "జ్ఞానజ్యోతి" శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్పీలు సుబ్బారెడ్డి గారు,విజయ భాస్కర్,రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సౌజన్య,కళావతి,వరలక్ష్మి మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో ఫ్రెండ్లీ పోటీ తప్పదా

**విజయవాడ:** రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా?రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా ఉన్న స్థానిక వర్గ పోరాటాలు, వ్యక్తిగత పట్టు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నాయకుడూ తన సొంత ఉనికిని కాపాడుకోవాలని భావించడం వల్ల పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలకు లోబడి సీట్లను త్యాగం చేయడం క్షేత్రస్థాయి కేడర్‌కు కష్టతరంగా మారుతోంది.గ్రామ రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న స్థానిక ఆధిపత్య పోరాటాలు కూటమి ఐక్యతకు ప్రధాన పరీక్షగా మారాయి. ఒకే పంచాయతీ లేదా వార్డులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి బలమైన నాయకులు ఉండటం వల్ల, ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా రెండో వర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో తమ ఉనికి కోల్పోతే భవిష్యత్ రాజకీయ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని కింది స్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా స్థానికంగా సర్దుబాటు కావడం అసాధ్యమని భావించే ప్రాంతాల్లో స్వతంత్రులుగానైనా బరిలోకి దిగాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.అధికారికంగా ఒకే అభ్యర్థిని బలవంతంగా రుద్దడం కంటే స్నేహపూర్వక పోటీలు ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ చిహ్నాల ప్రాతిపదికన జరగకపోవడం కూడా క్షేత్రస్థాయి నాయకులకు తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు కూటమి పార్టీల నేతలు బరిలో ఉన్నప్పటికీ, ప్రచారంలో హద్దులు దాటకుండా విపక్ష వైఎస్సార్‌సీపీకి మైలేజ్ రాకుండా చూసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.కూటమి అధిష్ఠానానికి స్థానిక సమన్వయం అతిపెద్ద పరీక్షగా నిలవనుంది. సమన్వయ కమిటీల ద్వారా సర్దుబాటు ప్రక్రియను ముందస్తుగానే పూర్తి చేయడం, నామినేటెడ్ లేదా ఇతర స్థానిక పదవుల హామీలతో అసంతృప్త నేతలను బుజ్జగించడంపై నాయకత్వం దృష్టి సారించింది. కింది స్థాయిలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను ప్రభావితం చేస్తుందనే భావనతో, ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంది.

## స్థానిక పోరుకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి



సమాచారమైనా కమిషన్ నేరుగా పత్రికా ప్రకటన లేదా మీడియా సమావేశం ద్వారా మాత్రమే ప్రజల దృష్టికి తీసుకువస్తుందని పునేఠా స్పష్టం చేశారు. అనధికారిక వనరులు, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే సమాచారాన్ని అధికారికమైనదిగా పరిగణించరాదని కోరారు. తదుపరి అధికారిక ప్రకటన వెలువడే వరకు ప్రజలు ప్రజాప్రతినిధులు ధ్రువీకరించిన అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని సూచించారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి.

డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్ల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

# స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..



**గుంటూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయినా సరే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దానికి కారణం వారసులను రాజకీయంగా సెట్ చేయడమే. కుమార్తెతో పాటు కుమారుడు ఇద్దరూ వైద్యులే. కానీ ఇంతవరకు వారు పొలిటికల్ గా సెట్ కాలేదు. అందుకే తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. కుమారుడు సందీప్ ను చీపురుపల్లి ఎమ్మెల్యే గారు చూడాలనుకుంటున్నారు బొత్స. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో తన కుమార్తె పేరును జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవి కోసం జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. మరోవైపు తాను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే తన కుమారుడికి జిల్లా పరిషత్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు తమ్మినేని. అయితే ఈ సీనియర్లంతా అంతిమంగా ఒకటే ఆలోచన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓట్లు, గ్రాఫ్ పెరిగితే పరవాలేదు.. లేకుంటే మాత్రం పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోవడమనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# టూ, త్రీ సిటీస్‌లో హోమ్ స్టేలు




**విజయవాడ :** ఏపీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేస్తోంది. పట్టణాల్లో హోమ్ స్టేలను తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ హోం స్టేలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నిర్ణయించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. పట్టణాల్లో హోం స్టేలను గుర్తించే పనిలో ఉన్నారు అధికారులు. ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణంగా పట్టణాలకు పనులపై వచ్చేవారు ఉంటారు. నగరాలకు సంబంధించి సందర్శనకు, ఆలయాలకు, పర్యటనల కోసం వస్తుంటారు. అటువంటి వారికి తక్కువ ఖర్చుతో వసతితో పాటు భోజనం అందించేలా ఈ హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధపడుతోంది ఏపీ ప్రభుత్వం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచేలా ఏర్పాట్లు చేస్తోంది.విశాఖ నగరాన్ని తీసుకుందాం. ఇక్కడకు చాలామంది పర్యాటకులు వస్తుంటారు. వారికి సరైన వసతి ఎక్కడ దొరుకుతుందో తెలియదు. అందుకే అధిక ధర వెచ్చించి హోటల్ గదుల్లో దిగుతుంటారు. అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఈ హోం స్టేలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది అనేది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం. మరోవైపు సంక్రాంతి సంబరాల సమయంలోనూ వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడే ఉండి సంక్రాంతి వేడుకలను తిలకిస్తుంటారు. అయితే బంధుమిత్రులు ఉన్నవారు పర్వాలేదు కానీ.. లేని వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అటువంటి సమయంలో ఈ హోం స్టేలు అనేవి ఎంతగానో దోహదపడతాయి. సాధారణంగా ప్రముఖ ఆలయాలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వాటిని సందర్శించే సమయంలో సైతం వసతి సమస్య ఏర్పడుతుంది. అటువంటి వారికి సైతం హోమ్ స్టేలు ఎంతగానో ఉపయోగపడతాయి.తక్కువ ధరకు పర్యాటకులకు వసతి కల్పించడంతో పాటు.. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలి అనేది ఈ హోం స్టేల ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో పట్టణాల్లో హోం స్టేలు సిద్ధం చేసేలా కసరత్తు జరుగుతోంది. అయితే స్థానికంగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు వారికి వివరించేలా బాధ్యతను కూడా అప్పగిస్తారు. ఎక్కడో అద్దెకు ఉన్నాం అన్న భావన లేకుండా.. అతిధులు మాదిరిగా ఆతిథ్యం పొందే వీలుగా ఈ హోం స్టేలు ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా ఆసక్తి ఉండి దరఖాస్తు చేసుకుంటే ముందుగా ఆ ఇళ్లను అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి సత్ప్రవర్తన కూడా పరిశీలించనున్నారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు కూడా ఉండకూడదు. అలాగే అతిధులకు సదుపాయాలు, గౌరవంగా వ్యవహరించడం వంటి అంశాలపై నిర్వాహకులకు శిక్షణ ఇవ్వనున్నారు హోమ్ స్టేకు కనీసం ఒక బెడ్ రూమ్ రెండు పడకలతో.. గరిష్ఠంగా ఆరుగదులు 12 బెడ్లతో ఉండాలి. సదరు ఇంటి యజమాని తన కుటుంబంతో అదే ప్రాంతంలో నివాసం ఉండాలి. ఒకవేళ అనుబంధంగా ఉండే బెడ్, బ్రేక్ ఫాస్ట్ కోసం యజమాని, ప్రమోటర్ అదే ప్రాంతంలో నివా నివాసం ఉండాల్సిన అవసరం లేదు. అటువంటి వారు అతిధులకు అవసరం అయినా సేవలు అందించేందుకు ఒక ప్రతినిధిని నియమించుకోవాల్సి ఉంటుంది. కాగా దాదాపు అన్ని ప్రముఖ పట్టణాల్లో మెప్మా అధికారులు అప్పుడే కసరత్తు ప్రారంభించారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

వ్యయంతో పనులు ప్రారంభించింది. కేంద్రం నిధులు సమృద్ధిగా మంజూరు చేసినా, గత ప్రభుత్వ హయాంలో పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఈ ప్రాజెక్టు పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం అరకొరగా పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి చేయలేదు. పైగా, జరిగిన ఆ కాస్త పనుల్లోనూ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి.

### మరో నాలుగేళ్లు పొడిగింపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాన్ని ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అయితే అప్పటికే జల్ జీవన్ మిషన్ గడువు ముగిసిపోయింది. దీనివల్ల కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వెంటనే రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్, కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. ఆయన చేసిన ప్రత్యేక ప్రయత్నాలతో జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించి అంగీకారం తెలిపింది. దీంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకానికి మళ్లీ ఊపిరి పోసినట్లయింది.

### 96 శాతం పనులు పూర్తి

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు పవన్ కల్యాణ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాడి తప్పిన పనులను దారిలోకి తెచ్చి, పనులు వేగవంతంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించారు. ఆయన నిబద్ధత ఫలితంగా ప్రాజెక్టులో రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఒక్క పులివెందుల తాగునీటి పథకానికే దాదాపు రూ. 280 కోట్లు కేటాయించి పనుల్లో వేగం పెంచారు. ప్రస్తుతం పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఈ పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందుతోంది. అటు లింగాల మండలం పరిధిలోని 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలోనే తాగునీరు అందనుంది.

### తుది దశకు చేరిన నిర్మాణాలు

ఈ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 65 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణానికి గాను ఏకంగా 1,106 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజలకు ప్రాథమిక అవసరమైన తాగునీటిని అందించేందుకు, రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని స్పష్టం చేసింది. ఈ దిశగా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈ మెగా వాటర్ గ్రిడ్ పనులను శరవేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

## ఎల్‌నినో దృష్ట్యా కృష్ణా జలాలను తాగునీటికే వాడుకోవాలి




హైదరాబాద్ జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఏపీ తరపున ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చారు.

### 47 ఁవీజలకు సూత్రప్రాయంగా అంగీకరం

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఈ ఏడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించగా ఏపీ తరపున అక్టోబర్ వరకే ప్రతిపాదించినట్లు ఏపీ జుచీజ నరసింహమూర్తి తెలిపారు. అప్పటివరకు 47 ఁవీజలు అడిగామని ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెప్పారు. రెండురాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని సెప్టెంబర్ 4న మరోసారి సమావేశమై చర్చిస్తామని జుచీజ నరసింహమూర్తి స్పష్టం చేశారు.

### ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే

సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామని తెలంగాణ ఈఎన్‌సీ రఘువర్ధన్ తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

"ఎల్‌నినో దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను తాగునీటినే వాడుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించాం. ఏడాది మొత్తం నీటి వాడకంపై తెలంగాణ ప్రతిపాదించింది. మేం అక్టోబర్ వరకే ప్రతిపాదించాం. అప్పటివరకు 47 టీఎంసీలు అడిగాం, సూత్రప్రాయంగా అంగీకరించారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదు. సెప్టెంబర్ 4న మళ్లీ సమావేశమై చర్చిస్తాం." "నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్‌లలో నీటి వాటాలపై చర్చ జరిగింది. ఎల్?నినో పరిస్థితుల దృష్ట్యా త్రాగునీటి కోసం మాత్రమే నీటిని వాడుకోవాలని త్రిసభ్య కమిటీలో నిర్ణయించారు. తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పాం. ఏపీ పోతిరెడ్డి పాటు నుంచి ఎక్కువ నీరు వాడుకొందని ఫిర్యాదు చేశాం. సెప్టెంబర్ 4వ తేదీన తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చ ఉంటుంది. భవిష్యత్‌లో ప్రవాహాలు వస్తే తదుపరి ఆలోచిస్తాం."

### సెప్టెంబర్ 4న మరోసారి భేటీ

తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరి సగం వాడుకోవాలని సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్? 4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

## భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే గుర్తొచ్చేది ముసునూరే

-మొదటిపేజీ తరువాయి

విషయం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. రోజుకు 29 టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ ప్రాసెసింగ్ కేంద్రం ఆసియాలోనే అతిపెద్దదని, 69 శాతం మార్కెట్ వాటా సాధించడం గర్వకారణమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. "మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి సాధించాలి. మన ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతి చేసే రోజు దగ్గర్లోనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లే వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి"

### రైతు ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం

ఉపరాష్ట్రపతి సీ.పీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ రైతులే దేశానికి వెన్నెముక అని అన్నారు. కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ దేశానికి అన్నం పెట్టేది రైతేనని కొనియాడారు. విత్తనం నుంచి పంట కోత వరకు సాగే వ్యవసాయ చక్రం ఆధారంగానే మన పండుగలు ఏర్పడ్డాయని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ కాలాల్లో పంటల పండుగలు జరుపుకోవడం భారత వ్యవసాయ సంస్కృతికి నిదర్శనమన్నారు.

దేశంలోని శ్రామిక శక్తిలో 46.1 శాతం మందికి వ్యవసాయ రంగమే ఉపాధి కల్పిస్తోందని, దాదాపు 55 శాతం జనాభాకు జీవనాధారంగా వ్యవసాయం కొనసాగుతోందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రైతులు సాధించిన ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

# కబ్జాదారులకు సహకరిస్తున్న ఇంటి దొంగలపై చర్యలు తీసుకోవాలి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**మాకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు ఉండగా మమ్మల్ని ఎవరు ఆపేది అంటూ రెవెన్యూ వారు వేసిన హెచ్చరిక బోర్డులను తొలగించి ఇష్టారాజ్యాంగ చెలరేగిపోతున్న కబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారికి సహకరిస్తున్న ఇంటి దొంగలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి రెవిన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి మరియు గోపవరం మండల ఇన్చార్జి తహసీల్దారు ఉదయభారతి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గోపవరం రెవెన్యూ కార్యాలయంలో ఇంటి దొంగల పాత్ర ఎక్కువైందని, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న కొంతమంది సిబ్బంది ఇంటిగుట్టును బయటపెడుతూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని, వీరి సహకారంతోనే కబ్జాదారులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని వారు ఆరోపించారు. ఈ మధ్యకాలంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ చేసిన పోరాటాల ఫలితంగా గోపవరం రెవిన్యూ గ్రామ పొలం 16, 64, 65, 168,234,1848,1852 తదితర సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములలో రెవిన్యూ వారు హెచ్చరిక బోర్డులు వేశారని, ఇప్పుడు ఆ హెచ్చరిక బోర్డులు కొంతమంది అధికార పార్టీ నేతలు మేము రప్పించుకున్న అధికారులు మాకు సహకరిస్తున్నారు మాకేంటి అడ్డు అంటూ తొలగించి ఇష్టారాజ్యంగా భూములను చదును చేస్తూ నిర్మాణాలు చేపడుతూ చెలరేగిపోతున్నారని తక్షణమే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తుండడంతో రెవెన్యూ అధికారుల పనితీరుపై చిత్తశుద్ధిపై ప్రజలు పలు అనుమానాలు కలుగుతున్నాయని ఇది వారి చేతకానితనంగా భావిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇటీవల పదవి విరమణకు దగ్గరగా ఉన్న కొంతమంది సిబ్బంది ఇంటి దొంగలుగా మారి అందినంత కాడికి దోచుకోవాలని ఇంటిగుట్టు కబ్జాదారులకు చేరవేస్తూ వారికి సహకరిస్తూ స్వామి భక్తిని ప్రదర్శిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలో రెవిన్యూ వారు హెచ్చరిక బోర్డులు వేసేటప్పుడు ప్రభుత్వ భూమిగా ఉన్న భూములలో నేడు లబ్ధిదారుల పేర్లు ఉన్నాయని చెప్పడం చూస్తుంటే రెవెన్యూ అధికారులు ఎంత చిత్తశుద్ధిగా పనిచేస్తున్నారో అర్థమవుతున్నదని ఈ విమర్శలకు మీరు సమాధానం చెప్పగలరా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వ భూములలో హెచ్చరిక బోర్డులు నాటేటప్పుడు లేని పేర్లు ఈనాడు ఎలా వచ్చాయో ఎవరి సహకారంతో వచ్చాయో పూర్తి విచారణ చేసి ఇంటిదొంగలపై శాఖాపరమైన చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డులు తొలగించిన కబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి తమ చిత్తశుద్ధిని రెవెన్యూ అధికారులు నిరూపించుకోవాలని లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ పార్టీ కమిటీ సభ్యులు రామరాజు, సంజీవ రాయుడు, జయరామరాజు, కే బాబు, విజయరావు, చంద్రపాల్, మహబూబ్ బాషా, పోతురాజు రమణ, మూరా ఈశ్వర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ సమస్యలను సరైన సమయంలో పరిష్కరించాలి అని బిఎస్ఎఫ్ నాయకుల ఆందోళన



**ఆగస్టు 24 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఫైట్ ఫర్ రైట్స్ ఆధ్వర్యంలో జరిగినటువంటి ( పి జి ఆర్ ఎస్). సమస్యలను సరైన క్రమంలో పరిష్కారం చేయకుండా నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ కలెక్టర్ గారి యొక్క ఆదేశాలు కూడా పక్కనపెట్టి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు కేపీ రాజు సమక్షంలో సాకే హరి అన్న ప్రజాసంఘాలు అందరు కూడా ఖండించడం జరిగింది. పీజిఆర్ఎస్ సమస్యలు పరిష్కారం చేయనప్పుడు ఎందుకు గ్రీవెన్స్ అని బిఎస్ఎఫ్ నాయకులు నాగిరెడ్డిపల్లి నరేంద్ర మాట్లాడడం జరిగింది. అలాగే గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు దాని కేటాయించిన బడ్జెట్ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రాణాలు పోతున్న ప్రభుత్వానికి మా గోడు పట్టదని గట్టిగా ఖండించారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు న్యాయం జరిగే వరకూ తనవంతు తన పోరాడుతానని కార్యక్రమం సమక్షంలో మాట్లాడారు.

## జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

చింతూరులో ఏఎస్పీ, ఏపీవోలకు వినతిపత్రం



**చింతూరు ఆగష్టు 24 ప్రజాజ్యోతి** రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం చింతూరు ఏఎస్పి బొడ్డు హేమంత్, ఐటిడిఏ ఏపీవో రామతులసికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాసినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ మైనింగ్ మాఫియా ఆగడాలపై నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల విశాలాంధ్ర విలేఖరి గోవిందు పై దాడి ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని, దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ అధ్యక్షుడు ఎండి షౌఖత్ అలీ, కార్యదర్శి నీలపు రాజేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మసకపల్లి సత్తిబాబు, బెజ్జంకి శ్రీనివాసచారి, బెజ్జంకి ఈశ్వర చారి, యూనియన్ సభ్యులు బెజవాడ నాగేంద్ర కుమార్, బేడే సతీష్, షేక్ రియాజ్, కొడమంచిలి జీవన్ కుమార్, కాక సీతారామయ్య, షేక్ ఖాదర్, తమ్మినేడి రామారావు, గెడ్డం సురేష్ కుమార్ చౌదరి, రాజు, గెడ్డం వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, షేక్ బాష, మాడి ముత్యాలరావు, బొర్రా రామారావు, పిడియాల మోహనరావు, వెంకన్న పాల్గొన్నారు.

## లవ్ జిహాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

### పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



**కూనవరం: ఆగస్టు 24 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు మండలాల్లో లవ్ జిహాద్‌కు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ, దీనిపై ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులు పోలీస్ స్టేషన్లలో వినతిపత్రాలు అందజేశారు. లవ్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిషేధించాలని డీజీపీ స్పందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు అందజేసిన వినతిపత్రంలో రాష్ట్రంలో ఇలాంటి ఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నోముల రామారావు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకయ్య, మండల అధ్యక్షులు కరక పవన్, సీనియర్ నాయకులు కారం దారయ్య, యువమోర్చా నాయకులు గేద శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఉయిక రత్తయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. పోలీసు అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

## ఆలమూరు శ్రీ జనార్ధన స్వామివారి ఆలయంలో నిశ్చితార్థ వేడుక



**ఆలమూరు ఆగష్టు 24(ప్రజాజ్యోతి):**ఆలమూరు జనార్ధనస్వామి ఆలయంలో సోమవారం ఒక జంట నిశ్చితార్థ వేడుక జరిగింది. కాకినాడ జిల్లా ఇంద్రపాలెం నుంచి గతంలో ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయానికి వచ్చిన భక్తురాలు తన సోదరునికి వివాహం నిశ్చయమైతే ఆ వేడుకను ఇక్కడే జరిపిస్తానని మొక్కుకున్నారు. స్వామి వారు అనుగ్రహించి ఆమె సోదరునికి వివాహం కుదరడంతో ఆ వేడుకను స్వామి సన్నిధిలో జరిపించారు. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు వారిని ఆశీర్వదించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆలమూరు జనార్ధన స్వామి వారి మహత్యాన్ని తెలుసుకొని నాలుగు శనివారాలు ఈ ఆలయానికి వచ్చి, నాలుగు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని తన అన్నకు వివాహం కుదరాలని కోరుకున్నానని, స్వామి తమ కోరికను నెరవేర్చారని ఆ భక్తురాలు సంతోషం వ్యక్తం చేశారు. ఎందరో భక్తుల నిస్వార్థ కోరికలు ఆలమూరు జనార్ధన స్వామి నెరవేరుస్తున్నారనడానికి ఈ మహిమ నిదర్శనమని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు అన్నారు.

## అంతర్జాతీయ స్థాయి జర్నల్ లో అధ్యాపకుని పరిశోధన పత్రం ప్రచురణ

**అభినందించిన శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కే.సీ.హరికుమార్**



**గుంతకల్లు ఆగష్టు 24 (ప్రజా జ్యోతి):** ప్రపంచంలోనే అత్యధిక ప్రామాణికం కలిగిన ప్రముఖ అంతర్జాతీ య అకడమిక్ జర్నల్ అయినా" ఇంటర్నేషనల్ జనరల్ ఆఫ్ హాస్పటాలిటీ మేనేజ్ మెంట్ జర్నల్ "లో, తమ కళాశాల మేనేజ్ మెంట్ విభాగం అధ్యాపకు లు డాక్టర్ వరప్రసాద్ పరిశోధన పత్రం ప్రచురితం కావడం తమ కళాశాలకు గర్వకారణం అని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీ కేసీహరి కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు అన్నారు. "ప్రస్తుత ప్రపంచం లో మారుతున్న ఆహార పద్ధతులు- మాధ్యమాల ద్వారా దాని ప్రభావము" అనే అంశం మీద తమ కళాశాలకు చెందిన అధ్యాపకుని పరిశోధన పత్రం అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమైన సందర్భంగా కళాశాలలో అతనిని అభినందించి మాట్లాడారు. పేరెన్నిక గల అమెరికా విశ్వవిద్యాలయాల విషయ నిపుణుల ప్రొఫెసర్లు సమీక్ష చేసి ప్రమాణాలకు తగినట్లు గా ఉంటేనే ఎంపిక చేస్తార ని, కేవలం రెండు శాతం మాత్రమే ప్రచురణకు ఆమోదం పొందుతాయి అన్నారు. ఏ స్టార్ రేటింగ్ తో క్యూ వన్ జర్నల్లో ప్రచురితం కావడం గొప్ప విషయమని వారు తెలిపారు. అధ్యాపక వృత్తి లో ఉండి, కళాశాలను అంతర్జాతీయ స్థాయిలో భాగం కల్పించినందుకు వారు అభినందనలు తెలియజేశారు. అత్యంత ప్రతిష్టాత్మక పోటీతత్వం గల అకడమిక్ జనరల్ లో ప్రచురితము కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని వారు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రచురితమైన కాపీని కళాశాల కరస్పాండెంట్ కు, ప్రిన్సిపాల్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సురేష్ బాబు అధ్యాపకులు బసెట్టి క్రిష్టయ్య, ఖాజావలి పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

మొక్కలను సంరక్షించి అభివృద్ధి చేసుకోవాలి: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మూర్తి

ఐటీసీ బంగారు భవిష్యత్, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ





బుట్టాయిగూడెం ఫారెస్ట్ నర్సరీలో రైతులకు పండ్ల, సహజ మొక్కల పంపిణీ

**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** రైతులు సాధారణ వ్యవసాయంతో పాటు పండ్ల మొక్కలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మూర్తి పేర్కొన్నారు. ఐటీసీ బంగారు భవిష్యత్ సహకారంతో, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని బుట్టాయిగూడెం ఫారెస్ట్ నర్సరీలో సోమవారం రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు, సహజ జాతుల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండలాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మూర్తి మాట్లాడుతూ, పంపిణీ చేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నాటి, సంరక్షించాలని సూచించారు. భవిష్యత్తులో ఈ మొక్కలు రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ, రైతులకు అండగా నిలుస్తున్న ఐటీసీ సంస్థను అభినందించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రతినిధి గీతా ప్రవళిక మాట్లాడుతూ, అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఈ మొక్కల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మొక్కలను పూర్తిస్థాయిలో పెంచి మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చిరాజు, అటవీ శాఖ సిబ్బంది, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవి, సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ ప్రాజెక్టు ఆఫీసర్ సతీష్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గణేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు రజాక్, నాగేశ్వరరావు, రాము, సురేష్, వీరబాబు మరియు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు.



**ఆలమూరు ఆగష్టు 24(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,చెముడులంక తాజా మాజీ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌ను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో, ఆయన మరియు ఆయన కుటుంబ సభ్యులు సోమవారం గోపాలపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచి, అక్రమ అరెస్టును ఖండిస్తూ తమకు మద్దతుగా నిలిచిన చిర్ల జగ్గిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే తమ్మన శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని వారు వివరించారు. తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు చిర్ల జగ్గిరెడ్డి భరోసా కల్పిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల కోసం పోరాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని చిర్ల స్పష్టం చేశారు.

## నిరుపేద యువతి వైద్య ఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సాయం చేసిన డాక్టర్ చల్లా.



**ఆలమూరు ఆగష్టు 24(ప్రజాజ్యోతి):**మండలం కేంద్రం ఆలమూరు ఎస్సీ పేటకు చెందిన కాయల రాముడు మనవరాలు లక్ష్మి ఆరోగ్యం క్షీణించిపోవడంతో వైద్యుల సూచనలు మేరకు అత్యవసరంగా కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్ళమనడంతో వైద్య ఖర్చులకు సాయం చెయ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు ను ఆయన స్వగృహానికి వెళ్ళి అడగ్గా, తక్షణమే డాక్టర్ చల్లా స్పందించి వారికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది, అలాగే పేషెంట్ కు మెరుగైన వైద్యం చెయ్యమని వైద్యులను ఫోన్ లో రిక్వెస్ట్ చేసినారు. అలాగే ఏదైన అవసరం అయితే మీకు అండగా ఉంటానని డాక్టర్ చల్లా వారికి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చినారు. ఇలాగే ఎస్సీ పేటలో ఎవరికైన ఆపద వస్తె నేను ఎళ్ళ వేళల సాయం చేస్తానని వారికి డాక్టర్ చల్లా హామీ ఇచ్చినారు. ఆపదలో ఉన్నాం ఆదుకోండి అని అడగ్గానే సాయం చేసిన దేవుడు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు అని ఎస్సీ పేట మహిళలు ఆయనకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి దుర్గ, అయితా విద్యమ్మ, దేవరపల్లి బాపనమ్మ, సాక భారతి, గూటం మేరి తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవాకర్ లో కింద రైతులకు వెంటనే సాగునీరు ఇవ్వాలి

-ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్



**ఆగస్టు 24 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఉరవకొండ నియోజకవర్గం లో హెచ్ ఎల్ సి జి బి సి హంద్రీ నీవా కాలువల కింద వెంటనే సాగునీరు ఇవ్వాలని కోరుతూ గౌరవ అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ గారిని రైతులు మరియు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేసిన పిఎసి మెంబర్, మాజీ ఎమ్మెల్యే ,ఇంచార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న హవిలికి భరత్ రెడ్డి ముత్తులూరు అశోక్ జెల్లిపల్లి మంజునాథరెడ్డి మరియు రైతు సంఘం నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బెంచ్‌ప్రెస్ పోటీలకు సర్వం సిద్ధం

జిల్లా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: జివి రామిరెడ్డి



జిల్లా జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి

**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** పాల్వంచలో ఈ నెల 30వ తేదీ ఆదివారం యూని టీ గోల్డ్స్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బెంచ్‌ప్రెస్ పోటీలను విజయవంతం చే యాలని జిల్లా జనరల్ సెక్రెట రీ జివి రామిరెడ్డి జిల్లా క్రీడా కారులకు పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వయసు నిర్ధారణ కోసం తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డును వెంట తీసుకురావాల ని ఆయన తెలిపారు. పోటీల కు ముందు ఉదయం 8 గంటలకు బరువు నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, క్రీడాకారులు సమయానికి చేరుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచితంగా టిఫిన్, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు మెమొంటోలు అందజేస్తామని చెప్పారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి పాల్గొన్న ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బెంచ్‌ప్రెస్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని జివి రామిరెడ్డి కోరారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9966588688, 9642120130 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఎరిగేరి గ్రామం గోవిందు,గబుగ నాగేష్ గారి మాతృమూర్తి మృతి...

నివాళులు అర్పించిన కోసిగి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి గారు యువ నాయకులు సతీష్ నాయుడు గారు...



**కౌతాళం, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** ఈరోజు మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం ఎరిగేరి గ్రామం తెదేపా ముఖ్య నాయకులు గబుగా నాగేష్ గారి మాతృమూర్తి సారాయి ఎల్లమ్మ (80) వృద్ధాప్యంతో ఈ ఉదయం మృతి చెందడం జరిగినది. గ్రామ నాయకులు పిలుపుమేరకు ఉదయం గ్రామానికి వెళ్లి నివాళులర్పిస్తూ మృతి పట్ల శాంతిని కాంక్షిస్తూ,ఈ కష్ట సమయం లో భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తూ,ప్రాగా డ సానుభూతి తెలియజే యడం జరిగినది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లెపాడు వెంకట రెడ్డి గ్రామ నాయకులు బసవరాజు,గిడ్డయ్య, గోవిందు, రమేష్ చెవుల రమేష్, పూజారి హనుమంతు,రవి,వీరేష్, ఆదమ్, హనుమంతు,పూజారి రమేష్ మొదలగు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించడం జరిగినది 24/08, 6:38: టీడీపీ నాయకులు ఎరిగేరి గ్రామం గోవిందు,గబుగ నాగేష్ మాతృమూర్తి మృతి...నివాళులు అర్పించిన కోసిగి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి మరియు యువ నాయకులు సతీష్ నాయుడు.సోమవారం రోజున కౌతాళం మండలం ఎరిగేరి గ్రామం తెదేపా ముఖ్య నాయకులు గబుగా నాగేష్ మాతృమూర్తి సారాయి ఎల్లమ్మ (80)వృద్ధాప్యంతో ఈ ఉదయం మృతి చెందడం జరిగినది. గ్రామ నాయకులు పిలుపుమేరకు ఉదయం గ్రామానికి వెళ్లి నివాళులర్పిస్తూ మృతి పట్ల శాంతిని కాంక్షిస్తూ,ఈ కష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తూ,ప్రాగాఢ సానుభూతి తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లెపాడు వెంకట రెడ్డి గ్రామ నాయకులు బసవరాజు,గిడ్డయ్య, గోవిందు,రమేష్,చెవుల రమేష్,పూజారి హనుమంతు రవి,వీరేష్, ఆదమ్,హనుమంతు, పూజారి రమేష్ మొదలగు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించడం జరిగినది.

# ప్రభుత్వాలు మారిన మారుమూల గ్రామాల రోడ్ల దుస్థితి మారదు





### కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బోదునూరు పాలగూడెం కాలువకు వేసిన వంతెన అంత దల్లె

**కూనవరం,ఆగష్టు24( ప్రజా జ్యోతి)** కూనవరం మండలం బోదనూరు నుండి పాలగూడెం ,మెట్టరామవరం మధ్యలో మెటల్ రోడ్డు శాంక్షన్ అయ్యి నిర్మాణం జరిగింది అయితే బోదునూరు పాలగూడెం మధ్యలో గల కాలువకు వంతెన నిర్మాణం చేశారు.ఆ వంతెనకు రెండు వైపులా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తిగా గ్రావెల్ మట్టి పోయకుండా అదేవిధంగా మెటల్ కూడా వెయ్యలేదు.సుమారు వంతెనకు అటు ఇటు పది మీటర్ల దూరం రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రజలు,ద్విచక్ర వాహనదారులు,నరకయాతన పడుతున్నారు. ఇదే మార్గం నుండి వరదల సమయంలో కోతులగుట్ట గ్రామం నుండి బోదునూరు తాటిలంక, ఏడుగురాళ్లపల్లి మీదుగా నిత్యవసరాల కోసం భద్రాచలం పట్టణానికి ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తూ ఉంటారు. అందు నిమిత్తం ఈ మెటల్ రోడ్డు వేసి ప్రయాణాలకు అనుగుణంగా చేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్ కి పనులు అప్పజెప్పితే పనులు సక్రమంగా చేయకుండా దొడ్డిదారిన బిల్లులు మార్చుకొని ఆ రోడ్డును గాలికి వదిలేశారు. పాలగూడెం,మెట్టరామవరం పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లాలన్న ఈ మార్గం నుండే వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా ఆ గ్రామ ప్రజలు నిత్య అవసరాలకు కూనవరం మండల కేంద్రానికి రావాలన్న ఇదే మార్గం నుండి రావాల్సి ఉంటుంది. ఈ మధ్యకాలంలో గర్భిణీ స్త్రీలను కోతులుగుట్ట హాస్పిటల్ కి తీసుకువచ్చే క్రమంలో కొంతమంది స్కిడ్ అయ్యి కింద పడ్డారని ఆ ప్రాంత ప్రజలు తెలియజేశారు. పాఠశాలలకు సరుకులు గుడ్లు, బియ్యం అన్ని రకాల వస్తువులు తీసుకెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోదునూరు గ్రామంలో వదిలేసి వెళ్లిపోతున్నారని పాలగూడెం మెట్టరామవరం పాఠశాల సిబ్బంది తెలియజేశారు. ఈ రోడ్డును తక్షణమే పూర్తిస్థాయిలో నిర్మించి వంతెనకూ ఇరువైపులా ఉన్న గోతులను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చేయాలని నామమాత్రంగా వంతెన పనులు చేసిన కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ప్రజల కష్టమే తన కర్తవ్యం.. సొంత నిధులతో రహదారి పునరుద్ధరణ!

వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనకు మరమ్మతులు ప్రజా సమస్యపై తక్షణ స్పందనకు గ్రామస్తుల హర్షం

స్మశానవాటికను జేసీబీతో శుభ్రం చేయించిన టీడీపీ నేత బాచినేని మల్లేశ్వరరావు



గ్రామంలో రహదారి, స్మశానవాటిక పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేత బాచినేని మల్లేశ్వరరావు మరియు గ్రామస్తులు



రహదారి పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేత బాచినేని మల్లేశ్వరరావు, గ్రామస్తులు

**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ తక్షణమే స్పందించడం ద్వారా టీడీపీ నాయకుడు బాచినేని మల్లేశ్వరరావు ప్రజాసేవలో ఆదర్శంగా నిలుస్తున్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం త్రిపురపెంటవీడు గ్రామం నుంచి గొల్లగూడెం వెళ్లే ప్రధాన రహదారిలోని ఊర చెరువు వద్ద ఉన్న వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో గ్రామస్తులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జ్ బాచినేని మల్లేశ్వరరావు వెంటనే స్పందించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ కీర్తిశేషులు బాచినేని శ్రీదేవి జ్ఞాపకార్థం తన సొంత నిధులతో రహదారి, వంతెన మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయించారు. పనులు పూర్తవడంతో రాకపోకలు తిరిగి పునరుద్ధరించబడ్డాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మల్లేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.స్మశాన వాటికకు మోక్షం సమీపంలోని ఎస్సీ కమ్యూనిటీ స్మశానవాటి కలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు, భారీ పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు మల్లేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపైనా వెంటనే స్పందించిన ఆయన సొంత ఖర్చులతో జేసీబీ యంత్రాన్ని రప్పించి స్మశానవాటిక ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు. దీంతో స్మశానవాటిక పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తన వంతు బాధ్యతగా సొంత నిధులతో పరిష్కారం చూపుతున్న బాచినేని మల్లేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దుద్దుకూరి సతీష్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెట్టుబడులు,పరిశ్రమలను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వ విఫలం

ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణ లో సాధించింది శూన్యం

పరిశ్రమలు తరలిపోతున్న ప్రభుత్వానికి చలనం లేదు

జమ్మలమడక నాగమణి



**కాకినాడ,ఆగస్ట్ 24 : (ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడం,యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు.టాటా పవర్, వెబ్సోల్ వంటి సుమారు 5 కంపెనీలు తమ పెట్టుబడుల ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవడం దీనికి ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు. లంచాలు, అవినీతి ఆరోపణలతో పరిశ్రమలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉంటే భవిష్యత్తులో పెట్టుబడిదారులు రాష్ట్రానికి ఎలా వస్తారని ప్రశ్నించారు.పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం కల్పించి, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రచారానికే పరిమితమైందని అన్నారు.కొత్త పరిశ్రమల ఏర్పాటులో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను ప్రోత్సహించి వాటి విస్తరణకు అవసరమైన సహకారం అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లడం ఆందోళనకరమని ఆమె అన్నారు.రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం అంటే కేవలం ఒప్పందాలు, ప్రకటనలు చేయడం కాదని, అవి వాస్తవ రూపం దాల్చి పరిశ్రమలు ఏర్పడి స్థానిక యువతకు ఉద్యోగాలు లభించినప్పుడే ప్రభుత్వ పనితీరు స్పష్టమవుతుందని పేర్కొన్నారు. పెట్టుబడుల పేరుతో భారీ సంఖ్యలు ప్రకటించడం కంటే ఎన్ని పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి పెట్టడానికి ప్రతిపాదనలు చేసుకున్న కంపెనీలు మన రాష్ట్రాన్ని విడిచి ఒరిస్సా,వెస్ట్ బెంగాల్ వంటి రాష్ట్రాలకు ఎందుకు వెళ్తున్నాయో ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆమె హితవు పలికారు. మరోవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని పెట్రోలు ధరలను పంచదార స్థాయికి తీసుకొస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వం పంచదారను పెట్రోలు ధరల స్థాయికి పెంచిందని ఉల్లిపాయల ధరలు కూడా కిలో 65 రూపాయలు వరకు పెరిగి సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని ఆమె అన్నారు. సంక్షేమ ప్రభుత్వం కాస్త ప్రజలను, రాష్ట్రాన్ని సంక్షోభంలో పడేసిందని ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు టాటా బై బై గుడ్ బై చెప్పాలని చూస్తున్నారని ఆమె అన్నారు. కాకినాడతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆమె ఆరోపించారు. పారిశ్రామిక రంగానికి స్పష్టమైన విధానం, పారదర్శకత,పెట్టుబడిదారులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశ్రమలు తరలిపోతున్న ప్రభుత్వానికి చలనం లేదని ఆమె విమర్శించారు.

# గురుకుల పాఠశాలలో నీటి కష్టాలు

-కూటమి ప్రభుత్వం పై మండి పడ్డ రాయదుర్గం.
మాజీ శాసన సభ్యులు గౌ!!శ్రీ మెట్టు గోవిందరెడ్డి గారు
-విద్యార్థులతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం
-విద్యాశాకమంత్రి నారా లోకేష్ విద్యార్థుల పట్ల మొద్దు నిద్ర విడాలి
-విద్యార్థుల పట్ల కనికరం లేదా విద్యార్థుల బాగోగుల పట్టించుకోవ లోకేష్
-ముఖ్యంగా నియోజకవర్గం లో కాలువ శ్రీనివాసులు మొద్దు నిద్ర మానాలి
-గురుకులంలో విద్యార్థుల బాగోగులు పట్టించుకొని దాగుడుమూతల ఎమ్మెల్యే ఎక్కడ



**-ఆగస్టు 24 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచర్జ్ శ్రీనివాస్ నాయుడు** గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యలు కరువై ఇబ్బందులు పడుతుంటే ఈ సమస్యలు నీకు కనపడవు వినపడవు అని మండి పడ్డారు. గత కొన్ని రోజుల నుండి పాఠశాలలో సక్రమంగా నీటి సౌకర్యం లేకపోవడం తో విద్యార్థులు స్నానం చేయడానికి మరుగుదొడ్లను వినియోగించడానికి సరైన మౌలిక సదుపాయాలు లేవు హాస్టల్లో నీటి తీవ్రత చాలా ఉంది , దాన్ని ఎంతవరకు పరిష్కరించలేదు, హాస్టల్లో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నీకు కనపడవు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన గురుకుల పాఠశాలలో ఇలాంటీ పరిస్థులు నెలకొనడం బాధాకరమని తెలియజేశారు.తల్లికి వందనం 2000 రూపాయలు టాయిలెట్ మెయింటెనెన్స్ కోసం తల్లిదండ్రులు అకౌంట్ నుంచి కట్ చేస్తున్నారు ఆ డబ్బులు అన్ని ఎక్కడికి పోయాయి, గత ప్రభుత్వం లో నాడు నేడు కింద స్కూల్ అభిరుద్ది చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిలి గారిదని వాటిని సక్రమంగా ఉపయోగించుకోవడంలో ఈ కూటమి ప్రభుత్వం విఫలమైందని,కనీస సౌకర్యాలు కూడ కల్పించలేని దుస్థితి లో ఈ ప్రభుత్వం ఉందని ఏద్దేవా చేసారు.

## సమాజంలో జరుగుతున్న యువతులను ప్రేమ పేరుతో మోసం చేయడం మరియు బెదిరించడం,బ్లాక్ మెయిల్ చేయడం బలవంతపు మతమార్పిడి

**మరియు లవ్ జిహాద్ వంటి అరాచకాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి...బిజెపి కౌతాళం మండల నాయకులు**



**కౌతాళం,ఆగష్టు 24 ప్రజా జ్యోతి** సోమవారం రోజున కౌతాళం మండల కేంద్రం నందు బిజెపి రాష్ట్ర పార్టీ మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ ఆదేశాలు మేరకు కౌతాళం మండల అధ్యక్షులు వెంకన్న ఆధ్వర్యంలో సమాజం లో జరుగుతున్న యువతలను మోసం చేయడం మరియు బెదిరించడం బ్లాక్మెయిల్ చేయడం బలవంతపు మతమార్పిడి మరియు లవ్ జిహాద్ వంటి అరాచకాలకు సంబంధించి కౌతాళం స్థానిక పోలీస్ స్టేషన్ నందు సీఐ గారికి వినతి పత్రం ఇచ్చిన బిజెపి నాయకులు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి నాయకులు మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో చోటు చేసుకున్న ఒక కుటుంబం విషాద ఘటనకు సంబంధించిన వార్తలు సమాజంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక కుటుంబం ఇలాంటి విషాద పరిస్థితులకు దారి తీసే విధంగా వేధింపులు బెదిరింపులు,బ్లాక్ మెయిల్ లేదా ఇతర అక్రమ చర్యలకు గురైనట్లు వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవిగా పరిగణించాల్సిన అవసరం ఉంది.ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకొని మతం ఏదైనా సరే యువతలను ప్రేమ పేరుతో మోసం చేయడం,వ్యక్తిగత ఫోటోలు మరియు వీడియోలతో బెదిరించాడం, బ్లాక్మెయిల్ చేయడం మతం మార్చుకోవాలని బలవంతం చేయడం కుటుంబ సభ్యులను బెదిరించడం వంటి చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు నిష్పక్షపాతంగా కఠినంగా చర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ ఉన్నాము.ఈ కార్యక్రమంలో బిజెపి కౌతాళం మండల అధ్యక్షులు వెంకన్న మరియు బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ విజయ్ మరియు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రామంజి,బిజెపి యువమోర్చ మండల అధ్యక్షులు బద్రి,బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న,బిజెపి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రమేష్,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బసవరాజ్ స్వామి,ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు రాజశేఖర్, మరియు బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మైబు మరియు బిజెపి మండల నాయకులు నింగప్ప,ఎల్లయ్య,హుసేని మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# బూడిద బల్కర్ల తో...... ప్రాణాలకు ముప్పు ఉంది

**రాష్ట్ర మాజీ మంత్రి కాకాణితో**
**ముత్తుకూరు గ్రామస్తులు ఆవేదన.**



**ముత్తుకూరు, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** ముత్తుకూరు వైపు వస్తున్న బూడిద బాల్కర్ల వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడి ఉందని ముత్తుకూరు గ్రామస్తులు ఆందోళన విషయాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం ఆయన మండలంలోని పైనంపురం, బ్రహ్మదేవం, ముత్తుకూరు గ్రామాలలో పర్యటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరుగులు పెట్టాయని, కూటమి పాలనలో అవినీతి, అరాచకం తప్ప, అభివృద్ధి, జాడే కనిపించడం లేదని కాకాణి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రిగా తాము పరిపాలన చేసినప్పుడు అభివృద్ధి, సంక్షేమ, కార్యక్రమాలు అమలు చేసామన్నారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి, అరాచకం, అన్యాయాలు తప్ప, అభివృద్ధి, సంక్షేమం, జాడే కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారని మాజీ మంత్రి అన్నారు. ముత్తుకూరు గ్రామానికి సంబంధించి బల్కర్లను, ముత్తుకూరు గ్రామంలోకి ప్రవేశించకూడదని తెలుగుదేశం పార్టీ నాయకులుధర్నాల పేరుతో డ్రామా ఆడినట్లు విమర్శించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి టన్నుకు 50 రూపాయల చొప్పున బేరమాడి, టన్నుకు 40 రూపాయల చొప్పున బూడిద బల్కర్లు తరలించే వ్యాపారుల తో ఒప్పందం కుదరడంతో, మరలా తిరిగి బల్కర్లను అనుమతి ఇచ్చినట్లు మాజీమంత్రి ఆరోపణ చేయడం జరిగింది. ముత్తుకూరు గ్రామ ప్రజలు, సోమిరెడ్డి బల్కర్లను గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకుంటూ ధర్నా చేయడం పట్ల, హర్షం వ్యక్తం చేస్తూ, సోమిరెడ్డికి సన్మానం కూడా చేశారని, సన్మానం చేసిన వారిని అవమాన పరిచే విధంగా, సోమిరెడ్డికి గిట్టుబాటు ధర లభించగానే ధర్నాలు విరమించి, తిరిగి బూడిద బల్కర్లను ముత్తుకూరు గ్రామం గుండా అనుమతించడాన్ని, ముత్తుకూరు గ్రామ వాసులు జీర్ణించుకో లేకపోతున్నారని మాజీ మంత్రి పేర్కొన్నారు.గ్రామ పంచాయతీల నిధులు దిగ మిగుతున్నారని విమర్శించారు. ఎక్కడా నిర్వహణ, మరమ్మత్తులు, పట్టించుకోకపోవడ దారుణం అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడక వేసి ఉందన్నారు. అంటువ్యాధులు ప్రబలడంతో పాటు, వీధిలైట్లు త్రాగునీరు, తదితర అనేక సమస్యల తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక,మట్టి, బూడిద, అమ్ముకుంటూ, కోట్లాది రూపాయల కొల్లగొడుతూప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. పైనంపురం గ్రామానికి సంబంధించి గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టులకు కక్కుర్తిపడి దేవరదిబ్బ గిరిజన కాలనీకి అతి సమీపంలో యాష్ పాండ్ ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పై ఆయన విమర్శలు చేయడం జరిగింది. అధికారంలోకి వచ్చాక, దేవర దిబ్బ గిరిజన వాసులకు యాష్ పాండ్ తొలగించి తన తప్పు సరిదిద్దుకుని న్యాయం చేస్తానని హామీ ఇచ్చి, ఆ హామీని తుంగ లో తొక్కి, థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి సిఎస్ఆర్ నిధుల పేరిట, అభివృద్ధి ముసుగులో, నిధులు దోచుకుంటూ తీవ్ర అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శించారు. పరిశ్రమలకు చెందిన సిఎస్ఆర్ నిధులుజిల్లా కలెక్టర్ ద్వారా ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సర్వేపల్లి లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వినియోగించాలే తప్ప, అలా కాకుండా తానే సోలార్ లైట్లు, తదితర కమిషన్ల వ్యాపారాలు చేస్తూ, పర్సంటేజీలు కొట్టేస్తూ, సిఎస్ఆర్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని మాజీ మంత్రి అన్నారు. అధికారం ఉన్న లేకపోయినా రాజకీయాలు సంబంధం లేకుండా ప్రజల కోసం పనిచేయడం తమ విధి అన్నారు. నూతన దంపతులైన సురేంద్ర, హర్షిత, విజయ శంకర్, మానసలను కాకాణి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, జడ్పిటిసి వెంకటసుబ్బయ్య, ఎంపీపీ సుగుణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## దేవాలయ అభివృద్ధికీ విరాళం అందజేత



**కౌతాళం ఆగస్టు 24 ప్రజా జ్యోతి** సోమవారం రోజున కర్నూలు జిల్లా సి బెళగల్ వాసవియులైన శ్రీమతి మంగమ్మ శ్రీ స్వామివారి దేవాలయ అభివృద్ధి కొరకు 74,905/- రూపాయలు విరాళముగా చెల్లించి ఉన్నారు.వారికి దేవస్థానం వారు శ్రీ స్వామి వారి శేష వస్త్రములు లడ్డు ప్రసాదములు మరియు బాండ్ పేపర్ ఇచ్చి దర్శనం కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థాన పర్యవేక్షకులు కే. వెంకటేశ్వరరావు పాల్గొనడం జరిగినది.

## గిరిజన సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యం


స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం
పెనుబల్లిలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం




**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):**గిరిజన గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, ఎటపాక మండలం రాయనపేట పంచాయతీ పరిధిలోని పెనుబల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో దీర్ఘకాలంగా నెలకొన్న రహదారి సమస్యను స్థానికులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై నాయకులు సానుకూలంగా స్పందిస్తూ, రహదారి సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని నాయకులు ప్రకటించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేయాలని మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మారాసు గంగాధర్, కొమ్ము వెంకటేష్, గోదేటి నాగరాజు, గద్దల ప్రవీణ్, మంద సాయి, మైపా సాయి, సోయం రామారావు, తెల్లం నాగరాజు, గుండి అంజిబాబు, పెనుబల్లి నాగరాజు, సోయం ఆదినారాయణ, పెనుబల్లి సమక్క, శాంతి, సోయం మంగతాయారు, పూనెం రవి, పెనుబల్లి అనుషా, శీలం మంగ, సోయం రాధ, పెనుబల్లి గంగమ్మ, తెల్లం వీరమ్మ, పూనెం దేవమ్మ, సోయం తులసమ్మ, తెల్లం బాలరాజు, పెనుబల్లి చిట్టిబాబు, తెల్లం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యరావుపేట ఎన్టీఆర్ బీచ్ వద్ద విషాదం.. ఇద్దరు మృతి





**కాకినాడ రూరల్: (ప్రజా జ్యోతి)** సూర్యరావుపేట ఎన్టీ ఆర్ బీచ్ వద్ద అలల ఉద్ధృతి కి ప్రమాదవశాత్తు నలుగురు యువకులు సముద్రంలో గల్లంతైన ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు, ఎమ్మెల్యే పంతం నానాజీ సూచనల మేరకు పంతం సందీప్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలు, మెరైన్ పోలీస్ సిబ్బంది, స్థానిక జనసేన పార్టీ మత్స్యకార నాయకులు గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్రంలో గల్లంతైన నలుగురిలో ఇద్దరి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కి తరలించారు.ఇదిలా ఉండగా, గల్లంతైన నలుగురిలో మరో ఇద్దరిని సముద్రం నుంచి సురక్షితంగా రక్షించి కాకినాడ జి జి హెచ్ లో చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లిన పంతం సందీప్ బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పంతం సందీప్ పరామర్శించి, ఎమ్మెల్యే పంతం నానాజీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన వారి కోసం చేపట్టిన సహాయక చర్యల్లో రెస్క్యూ, మెరైన్ పోలీస్, మత్స్యకార బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# అప్పు రూ.4.50 లక్షలు.. ఆస్తి విలువ రూ.50 లక్షలు?

**ఇంటి స్థలం స్వాధీనం చేసుకున్నారంటూ బాధిత కుటుంబం ఆవేదన.. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు**



**కాకినాడ (ప్రజా జ్యోతి)** నాలుగున్నర లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నందుకు తమకు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన ఇల్లు, ఇంటి స్థలాన్ని తమకు తెలియకుండానే స్వాధీనం చేసుకున్నారని పెదపూడి మండలం పెదపూడికి చెందిన కొలుసు సింహాచలం, ఆయన భార్య సత్యదుర్గాదేవి ఆరోపించారు. తమకు న్యాయం చేయడంతో పాటు తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపూడిలో గత 15 సంవత్సరాలుగా బండిపై టిఫిన్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం ద్వారంపూడి బంగారురెడ్డి వద్ద రూ.4.50 లక్షలు అప్పుగా తీసుకున్నామని తెలిపారు. తమ ఇంటి దస్తావేజులను తీసుకుని, అప్పు చెల్లించాలంటూ తమ పేరుతోనే రుణం ఏర్పాటు చేసి సుమారు రూ.16 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. బతుకుదెరువు కోసం పెదపూడి నుంచి కాకినాడ రూరల్ మండలం రాయుడువారిపాలెం శేషాద్రినగర్‌కు వచ్చి టిఫిన్ షాపు నిర్వహిస్తున్నామని చెప్పారు. అయితే మూడు నెలల క్రితం ద్వారంపూడి బంగారురెడ్డి రౌడీలతో రెండు కార్లలో వచ్చి తమను బ్యాంకుకు తీసుకెళ్లి పలు పత్రాలపై సంతకాలు చేయించారని ఆరోపించారు. అనంతరం తమ ఆస్తిని ఆయన పేరుపై బదలాయించుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించగా ఎక్కువగా మాట్లాడితే దెబ్బలు తింటావంటూ బెదిరించారని వాపోయారు. అంతేకాకుండా శనివారం తమ పెద్ద కుమారుడి పేరున ఉన్న సుమారు సెంటున్నర స్థలాన్ని కూడా భయపెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తే తమ కుటుంబాన్ని అంతం చేస్తామంటూ బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడటంతో కాకినాడ కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ వ్యవహారంపై ఎస్పీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అధికారులు తమ ఫిర్యాదును విచారించి, ఆస్తులను కాపాడి, తమకు న్యాయం చేయడంతో పాటు తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని బాధిత దంపతులు వేడుకున్నారు. గమనిక: పై కథనంలోని ఆరోపణలు బాధితులు చేసిన ఫిర్యాదు, వారి వాంగ్మూలం ఆధారంగా ఉన్నాయి.

# మాకు స్థలాలు ఇచ్చింది మీరు... పట్టాలు ఇచ్చింది మీరు... శంకుస్థాపన చేసింది మీరు...!! గుమ్మడికాయ కట్టింది మీరు...!! మా రహదారులకు సిసి రోడ్లు నిర్మించండి మహాప్రభువు...!!

**కాలనీవాసులు వినతి...!!**



**జి.కొండూరు :( ఆగస్టు 24,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** మండల కేంద్రమైన జి.కొండూరులో గత ప్రభుత్వ హయాంలో శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కుల-మతాలకు పార్టీలకు,అతీతంగా మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మా స్థలాలకు ఇళ్ళ పట్టాలు ఇప్పించి స్థలాలకు శంకుస్థాపన నిర్వహించి... ఇళ్లకు గుమ్మడికాయ కట్టేందుకు కృషి చేసింది శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అని అలాంటి మిమ్మల్ని మేము ఎప్పటికీ మరిచిపోమని మీ వెంటే మేము అని కాలనీవాసులు సోమవారం ప్రజా జ్యోతి పేపర్ తో పత్రికా ముఖంగా శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, లైట్లు ఏర్పాటు చేయించి, కాలనీకి శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ వెలుగులు నింపారని అలాగే మా నివాసాల రహదారులు డ్రైనేజీ సౌకర్యం లేక చిన్నపాటి వర్షం పడిన రహదారులు నీటితో నిండి నడవడానికి ఇబ్బంది ఏర్పడుతుందని కావున గౌరవనీయులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ మా రహదారులకు,సిసి రోడ్లు ఏర్పాటుకు కృషి చేయాలని పత్రికా ముఖంగా కోరుతున్నట్టు తెలిపారు. అలాగే వచ్చే గ్రామపంచాయతీ,ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో సైతం మా కాలనీవాసులు మీ వెంటే ఉంటామని ఈ సందర్భంగా కాలనీవాసులు తెలియజేశారు. ఏది....ఏమైనా అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పాలన చేస్తున్న శాసనసభ్యులు వసంత కృష్ణ

# సచివాలయాలకు 'స్వర్ణ' బిరుదు గర్వకారణం

- ప్రజలకు మెరుగైన సేవలు
- ఉత్తమ పాలనకు గుర్తింపుగా స్వర్ణ నామకరణం అభినందించదగ్గ విషయం
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు




**రణస్థలం , ప్రజాజ్యోతి న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయాలకు 'స్వర్ణ' బిరుదును ప్రదానం చేయడం గర్వకారణమని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షులు పిన్నింటి వెంకట నాయుడు అన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ, మెరుగైన పాలన అందిస్తున్న పంచాయతీలను గుర్తించి 'స్వర్ణ' అనే గౌరవ నామకరణం చేయడం అభినందనీయమన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పలు పంచాయతీలకు ఈ బిరుదు దక్కడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పంచాయతీల పనితీరును మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆలోచనకు ముఖ్య మార్గదర్శకులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ వ్యవహరిస్తున్న తీరును భానోజీ నాయుడు కొనియాడారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. స్వర్ణ' బిరుదు పొందిన పంచాయతీలను చూసి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని మాజీ సర్పంచులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పంచాయతీల పనితీరుకు గుర్తింపు లభించడం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు 'స్వర్ణ' బిరుదు మరింత స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

# కుటుంబం ఆత్మహత్యలకు కారకుడైన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**పోదూరు మండల భారతీయ జనతా పార్టీ డిమాండ్.**



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు -24.** కాకినాడ జిల్లా పిఠాపురంలో ఏఈగా పనిచేస్తున్న నూకరాజు కుటుంబం రాజమండ్రి బ్రిడ్జ్ పై నుండి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినందున ఆయన కుటుంబం మరణానికి కారణమైన నిందితుడు షేక్ సాదిక్ ఖాన్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని పోడూరు మండల బీజేపీ అధ్యక్షులు చింతపల్లి రమేష్ శెట్టి డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రమేష్ శెట్టి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ ఆదేశం మేరకు వినతిపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. మతాంతర వివాహాల విషయంలో ఏ విధమైన పిర్యాదులు అందినా వెంటనే ఏమైనా లవ్ జిహాద్ మరియు ఇతర కుట్ర పూరితమైన అంశాలను పరిశీలించి సమగ్ర విచారణ చేసి బాదితులకు న్యాయం చేయాలని కోరారు. కుట్ర చేసే వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో అన్ని పోలీస్ స్టేషన్ లలో ఆయా ప్రాంతాల బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు శక్తి కేంద్ర నాయకులు మహిళా అధ్యక్షురాలు, పూడి వలస మాధవి, పోడూరు మండల జనరల్ సెక్రెటరీ మేడపాటి సత్య వరప్రసాద్ రెడ్డి, కొండేటి సర్వేశ్వరరావు, భవ్య, జి.ఎస్ ఆకుమర్తి, కుసుమే ఆడమ్స్, దొమ్మేటి గిరి కుమార్, గుత్తుల వెంకటేశ్వరరావు, కుడుపూడి జయరాజు, వల్లూరి నాగ ప్రసాద్, జవాది వీరరాఘవులు, గెద్దాడ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలి: కాకినాడ కలెక్టరేట్ వద్ద హిందూ సంఘాలు, బీజేపీ ధర్నా



**కాకినాడ (ప్రజా జ్యోతి)** లవ్ జిహాద్ వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న అసిస్టెంట్ ఇంజనీర్ నూకరాజు కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, ఇందుకు కారణమైన సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా, ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలుకు చెందిన బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆర్ఎస్ఎస్ బజరంగ్ దళ్ నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాకినాడ నాయకుడి సిఫార్సుతో ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌లో రైఫిల్ షూటింగ్ శిక్షకుడిగా చేరిన సాధిక్ ఖాన్, లవ్ జిహాదీకి పాల్పడి ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడానికి కారణమయ్యాడని ఆరోపించారు. ఈ కేసు కేవలం ఆత్మహత్యకు సంబంధించింది కాదని.. దీని వెనుక వంచన, మోసం, దోపిడీ, హత్య, లవ్ జిహాద్, ఉగ్రవాద కోణాలు దాగి ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ అధికారులకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్టా మధు, పెద్దశెట్టి మహేష్, మేడసాని కామరాజు, కర్రి అన్నవరం, మహిళా మోర్చా నాయకురాళ్లు సాయి అపర్ణ, సైతన సత్యకుమారి, యువమోర్చా నాయకులు ,హిందూ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# బుట్టాయిగూడెం శివాలయంలో భక్తి వైభవం!

**పవిత్ర సోమవారం ఘనంగా పూజలు**

**భక్తులకు అన్నప్రసాద వితరణ**



పవిత్ర సోమవారం సందర్భమున అన్నప్రసాద వితరణ

**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** పవిత్ర సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామంలో వెలసిన శివాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి పరమేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు గొట్టుపుల్ల కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు విస్తృత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గన్నవరం గ్రామానికి చెందిన దాతలు పునుగుపాటి శేఖర్--రమాదేవి దంపతులు ఈ అన్నప్రసాద వితరణను స్వయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావులతో పాటు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది

# రెండేళ్ల కూటమి పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు..ఎమ్మెల్యే అమిలినేని

**తోపుడు బండ్లు అందించి పండ్లు, పూల వ్యాపారులకు అండగా ఉంటాం**

**ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించిన ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు**




**కంబదూరు ఆగస్టు 24:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమంగా చేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెడుతూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని, ఏ ఇంటికి వెళ్లి అడిగిన రెండేళ్ల పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, పేర్కొన్నారు..నేడు కంబదూరు మండల కేంద్రంలో రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలుసుకుంటూ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకునేందుకు చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి కంబదూరు మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, కు మండల టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలకగా అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని, ప్రధాన రహదారిలో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక వైపు అభివృద్ధి చేస్తూ, ఎక్కడా కూడా సంక్షేమ పథకాలను ఆపకుండా అందిస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ఒక మోడల్ గా నిలిపారని పేర్కొన్నారు..గ్రామంలో రోడ్డు పక్కన పండ్లు, పూల వ్యాపారాలు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లు అందించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు పై రోడ్డు వేయడంతో నిధులు వృథా నామన బుజ్జి



**తాళ్లపూడి, ఆగస్టు 24, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం అనంతం వారి వీధిలో సిమెంటు రోడ్డుపై మళ్లీ సిమెంటు రోడ్డు వేశారని నామన బుజ్జి ఆరోపించారు. తాళ్లపూడి ఎంపీడీవో, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, డిప్యూటీ ఎంపీడీవో కి గాని రోడ్డు వేస్తున్నట్టు తెలియకపోవడం విశేషం. అంతే కాకుండా బీసీ కాలనీ కి వెళ్ళుటకు రహదారి అని తప్పుడు సమాచారం ఇవ్వడం మరొక విశేషమన్నారు. పాత సి సి రోడ్ పాడవకుండా కొత్త సి సి రోడ్ నిర్మాణం చేసి మండల పరిషత్ మరి నిధులను దుర్వినియోగం చేస్తుంటే అధికారులు చూస్తూ ఎలా ఊరుకున్నారు అని ప్రశ్నిస్తున్నారు. పాత సిసి రోడ్డుపై కొత్త సీసీ రోడ్డు ఎందుకు నిర్మాణం చేయుచున్నారని మండల అధికారులను మరియు తాళ్లపూడి గ్రామం పంచాయతీ సెక్రెటరీని ప్రశ్నించగా తమకు తెలియదు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు పూర్తి విచారణ జరిపి ప్రభుత్వ నిధులను కాపాడాలని ఆయన కోరారు హెడ్డింగ్ పెట్టి వార్త రూపంలో అందించగలరు

## ప్రజల భద్రత కోసం పోలీసులు




**కుక్కునూరు,ప్రజా జ్యోతి,ఆగస్ట్ 24 :** కుక్కునూరు మండలం వెంకటాపురం గ్రామంలో ఎస్-టర్నింగ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు.ఎదురుగా వచ్చే వాహనాలు కనపడని ప్రాంతంగా ఉండటంతో ఎస్-టర్నింగ్ ప్రాంతంలో రహదారి పక్కన ఉన్న పొదలు,ముళ్ల కంపలు జేసీబీ తో తొలగించారు.దీని ద్వారా వాహన దారులకు ఎదురుగా వచ్చే వాహనాలు చక్కగా కనిపిస్తాయని,ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఉంటుందని ఎస్సై తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ,ప్రజల ప్రాణాల రక్షణ మరియు సురక్షితమైన రాకపోకలకు పోలీసులు నిరంతరం ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.


## గణనాథుల సందడి.. పండుగకు ముందే కళకళ

**తమకు నచ్చిన రంగుల్లో గణనాథులను ముస్తాబు చేసుకునేందుకు భక్తుల ఆసక్తి**



**ప్యాపిలి, ప్రజా జ్యోతి రిపోర్టర్ బండి రమేష్** వినాయక చవితి పండుగ సమీపిస్తుండడంతో గణనాథుల సందడి మొదలైంది. పండుగకు ఇంకా కొద్దిరోజుల సమయం ఉండగానే వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు, యువత ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల విగ్రహాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు కావడంతో అక్కడ సందడి నెలకొంది.తమకు నచ్చిన ఆకృతి, పరిమాణంలోని విగ్రహాలను ఎంపిక చేసుకుంటున్న భక్తులు.. వాటికి తమకు ఇష్టమైన రంగులు వేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వివిధ రంగుల్లో గణనాథులను అందంగా ముస్తాబు చేసేందుకు కళాకారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతూ బిజీగా ఉన్నారు.చిన్నారులను ఆకట్టుకునే చిన్న విగ్రహాల నుంచి మండపాల్లో ప్రతిష్ఠించే భారీ విగ్రహాల వరకు వివిధ రకాల గణనాథులు అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులు తమ అభిరుచికి అనుగుణంగా ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో పండుగకు ముందే మండలంలో వినాయక చవితి వాతావరణం కనిపిస్తోంది.పండుగ సమీపిస్తున్న కొద్దీ విగ్రహాల కొనుగోళు మరింత పెరిగే అవకాశం ఉందని విక్రయదారులు చెబుతున్నారు. గణనాథుల ప్రతిమలకు రంగులు అద్దుతూ కళాకారులు బిజీగా ఉండగా, తమకు నచ్చిన వినాయకుడిని ఇంటికి తీసుకెళ్లేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీబీ. మంజునాథరెడ్డి



**గుంతకల్లు ఆగస్టు 24 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఫంక్షన్ హాల్ నందు నైరుతి వైన్స్ కొనకొండ్ల నాగరాజు కుమార్తె వివాహానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సిబి. మంజునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన తో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## తోవి గ్రామంలో ఘనంగా సప్త భజన ముగింపు కార్యక్రమం







**కౌతాళం, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోనే తోవి గ్రామంలో గత ఏడు రోజుల నుంచి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వర్షం కోసం సప్త భజన కార్యక్రమం చాలా అంగరంగ వైభవంగ నిర్వహించడం జరిగింది. గత 7రోజుల నుంచి గ్రామమంతా శివ నామ స్మరణాలతో సప్త భజన కార్యక్రమం నిర్వహించి సోమవారం రోజున అనగా 24వ తేదీన ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి పీఠాధిపతులు రావడం జరిగింది అలాగే గ్రామంలో స్త్రీలు 151 కుంబోస్థవాలు,కలుశాలతో పూజలు అందించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించి గురువుల యొక్క ఆశీర్వచనాలు తీసుకోవడం జరిగింది.గ్రామ ప్రజలు మరియు భక్తులందరూ కలిసి గ్రామ పెద్దలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# కూనవరం మండల ఆదివాసీ గిరిజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

### ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు ఉద్యమాలు చేపడతాం

### 12 గ్రామాలకు భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ వెంటనే కల్పించాలి







**కూనవరం, ఆగస్టు 24, ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం కూటూరు గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో 21 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా తెల్లం తమ్మయ్య, అధ్యక్షులు సున్నం వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారు.ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సీసం సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులు చట్టాలపై పాలక ప్రభుత్వాలు అనేక రకాలుగా దాడులు చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీ హక్కులను కాపాడేందుకు నూతన కమిటీ ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రావాల్సిన 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్లు, 1/70 చట్టం, పీసా చట్టం వంటి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాలని అన్నారు.

**మహాసభలో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు:**

1. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి.
2. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలి. లేకపోతే దాని స్థానంలో ప్రత్యేక జీవో తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించి ఆదివాసీలకు 29 రకాల ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి.
3. ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ కట్టడాలు, భూ అక్రమాలను అరికట్టాలి.
4. గిరిజన గ్రామాలకు త్రాగునీరు, రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి.
5. గిరిజన ప్రాంతంలో వైద్యం, విద్య, ఉపాధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.
6. ఆదివాసీ భాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను పరిరక్షించాలి.
7. కూనవరం మండలంలోని ప్రభావిత 12 గ్రామాలకు వెంటనే భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ పునరావాసం కల్పించాలి
8. మండలంలోని ముంపు ప్రభావిత గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతకు కట్ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఉపాధి, పునరావాస ప్రయోజనాలు కల్పించాలి.

కూనవరం మండలంలో మొత్తం 56 గ్రామాలు ఉండగా, 48 గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ, కాంటూరు లెక్కల పేరుతో తప్పుడు నివేదికలు చూపిస్తూ ఆదివాసీలను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహాసభ ఆవేదన వ్యక్తం చేసింది.ముంపు ప్రభావిత గ్రామాలకు త్వరితగతిన భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్, ఇంటి నిర్మాణ విలువ, యువతకు పునరావాస ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే మండల వ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేసి ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం చేపడతామని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం నూతన కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

**నూతన మండల కమిటీ సభ్యులు**

బొగ్గ రామారావు, సోడే శంకర్, బాబు బొర్రయ్య, నూప రాజు, ధర్మల అమ్మాజీ, జోడే రాజు, మడకం పొద్ద య్య, కొమరం మోహన్, బొగ్గ సమ్మక్క, మోసం హరీష్, శీలం పిచ్చయ్య, బొగ్గ వెంకయ్య, చిచ్చడి సత్యనారాయణ, మడకం శిరమయ్య, పైదా శ్రీకాంత్, పైద వెంకమ్మ, కుంజ సుధాకర్, గుండం బాబురావు, వుయిక కన్నయ్య తదితరులు నూతన కమిటీలో ఎన్నికయ్యారు.

## అర్జీల పరిష్కారమే లక్ష్యం




**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఆయన అర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 127 అర్జీలు అందగా, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే సమస్యపై పునరావృతంగా అర్జీ రాకుండా చూడాలని స్పష్టం చేశారు.గత వారం ప్రజా సమస్యల పరిష్కారంలో ఉత్తమ సేవలు అందించిన చీరాల దేవాంగపురి.1 స్వర్ణ గ్రామానికి చెందిన సంక్షేమ, విద్యా సహాయకురాలు కులకల సౌందర్యను కలెక్టర్ సత్కరించి అభినందించారు. ఆమె అనుసరించిన విధానాన్ని అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల సవరణ, ఎస్ఐఆర్, పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, పురపాలక ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు. బాపట్ల మండలంలో హియరింగ్ ప్రక్రియలో జాప్యంపై ఆరా తీసిన కలెక్టర్, ప్రణాళిక ప్రకారం రోజుకు 250 మందికి హియరింగ్ నిర్వహించి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యాలయాల్లో ఫైళ్ల తొలగింపును వేగవంతం చేయాలని, ప్రతి వారం జిల్లా అధికారుల కార్యాలయాలను తనిఖీ చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 3న మెప్మా, బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో లోన్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించి, పోస్టర్‌ను విడుదల చేశారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్డీఓలు, మండల అధికారులు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## సాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలని వినతి

### రామాపురం బిజెపి మండల అధ్యక్షులు గంప సుబ్బరాయుడు



**రామాపురం ఆగస్టు 24 ప్రజా జ్యోతి** భారతీయ జనతా పార్టీ రామాపురం మండల అధ్యక్షులు గంప సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబంకు న్యాయం చేయాలని, ఈ కేసులో వంచన, మోసం, దోపిడి, హత్య, లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నది అని, సాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర డిజిపి, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలని ఈరోజు రామాపురం మండలం పోలీస్ స్టేషన్ లోని స్టేషన్ ఇన్చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రఫీ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు గంప సుబ్బరాయుడు మాట్లాడుతూ వైయస్సార్సీపీ కాకినాడ నాయకుని సిఫార్సుతో ఇంటర్నేషనల్ స్కూల్ లో రైఫిల్ షూటింగ్ శిక్షకునిగా పని చేస్తూ పరిచయమైన సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబంకు సత్వర న్యాయం చేయాలని, ఈ కేసులో వంచన, మోసం, దోపిడి, హత్య, లవ్ జిహాదీ ఉగ్రవాదం అన్నీ ఉన్నాయి. షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించి, ఇతనికి సహకరించినవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర డీజీపీ, హోం మంత్రి ఈ సంఘటనపై వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భాస్కర్ రెడ్డి, విహెచ్ పి వీరారెడ్డి, నాయకులు ఆంజనేయులు, శ్రీనువాసులు, రామచంద్ర, రమణ, రాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అద్దేపల్లి ప్రభుత్వ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 24.** పాలకొల్లు శ్రీ అద్దేపల్లి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో సోమవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికిఅధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ కె రత్న మాణిక్యం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటు న్నామన్నారు. 2023 ఆగస్టు 23న భారత దేశం చంద్రయాన్--3 నుండి చంద్రునిపై విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ సాధించి న చారిత్రాత్మక విజయాన్ని గుర్తుచేసుకోవడ మే ఈ దినోత్సవం ముఖోద్దేశ్యమని ప్రిన్సిపాల్ తెలిపారు. చంద్రయాన్--3 విజయం భారత శాస్త్రవేత్తల ప్రతిభకు, కృషికి, పట్టుదలకు, శాస్త్రీయ ఆలోచనా విధానానికి నిదర్శనమ ని,ఈ విజయం ప్రతి భారతీయుడిలో గర్వాన్ని నింపిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బూసి వెంకట స్వామి మాట్లాడుతూ చంద్రయాన్--3 విజయం మనకు క్రమశిక్షణ, పరిశోధన, టీమ్ వర్క్, సమస్య పరిష్కార నైపుణ్యం మరియు నిరంతర అభ్యాసం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంద న్నారు. నాణ్యమైన విద్యలో విద్యార్థుల్లో కేవలం పుస్తక జ్ఞానాన్ని మాత్రమే కాకుండా పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన మరియు ఆవిష్కరణ సామర్థ్యాలను పెంపొందించడం ముఖ్యమన్నారు. అకడ మిక్ కోఆర్డినేటర్ జి సుమలత మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అంత రిక్ష పరిశోధనలలో ఎన్నో సవాళ్లు, వైఫల్యా లు ఎదుర్కొని విజయాలను సాధించారని అ న్నారు. వైఫల్యాలకు భయ పడకుండా కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రయో గాలు చేయాలని, కొత్త ఆలోచనలను అభి వృద్ధి చేయాలని అయన అన్నారు. భౌతిక శాస్త్ర విభాగం ఇంచార్జ్ బికేవి రామలక్ష్మి అధ్యాప కురాలు పి. రామమణి జాతీయ అంతరిక్ష దినోత్సవం యొక్క చరిత్రను వివరించారు. విద్యార్థి డి. వికాస్ చంద్రయాన్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెయింటింగ్ అండ్ డ్రాయింగ్ కాంపిటేషన్ లో గెలిచిన విద్యార్థినీ విద్యార్థులకు పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు.

## నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

**ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి.**



**అన్నమయ్య జిల్లా ఆగస్టు 24 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం, పుంగనూరు మండలంలోని నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. 2021--22 సంవత్సరంలో రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించిన సమయంలో ప్రాజెక్టుకిందవున్న వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికి, నష్టపరిహారం విషయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటికి అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాజెక్టుకోసం భూములు కోల్పోయిన రైతులకు అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎకరాకు రూ.14 నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచినా నష్టపరిహారం అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని రంగారెడ్డి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో బాధిత రైతులతో కలిసి మదనపల్లె కలెక్టరేట్‌కు చేరుకున్న రంగారెడ్డి, సంబంధిత అధికారులను కలిసి రైతుల సమస్యలను వివరించారు. భూము లు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించా లని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.భూములు కోల్పోయిన రైతులు ప్రస్తుతం సాగు చేసుకునేందు కు భూమిలేక, ఉపాధి అవకాశాలులేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి తెలిపారు. అప్పులుచేసి జీవనం సాగిస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు.రైతులకు న్యాయం జరగకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, న్యాయం జరిగే వరకు ఉద్య మాన్ని కొనసాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు మోహన్ నాయుడు, వెంకట్ రెడ్డి, గూడెం మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వసంత కృష్ణ ప్రసాద్ గారు మాకు స్థలాలు ఇచ్చింది మీరు....పట్టాలు ఇచ్చింది మీరు... కొబ్బరికాయ కొట్టింది మీరు.. గుమ్మడికాయ కట్టించింది మీరు మా రహదారులకు సిసి రోడ్లు నిర్మించండి మహాప్రభో...!!



**జి.కొండూరు :( ఆగస్టు 24,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** మండల కేంద్రమైన జి.కొండూరులో ని కాలనీవాసులు సోమవారం ప్రజా జ్యోతి పత్రికా ముఖంగా మాట్లాడుతూ.... మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గత ప్రభుత్వ హాయంలో మాకు కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా ఇళ్ల స్థలాలు ఇచ్చారని అలాగే ఆ స్థలాలకు పట్టాలు కూడా ఇచ్చారని, అలాగే ఆ స్థలాలకు శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టారని ఇల్లు నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఇళ్లకు గుమ్మడి కాయ కట్టించేందుకు వసంత ఎంతో కృషి చేశారని అలాగే మా కాలనీ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించి లైట్లు పెట్టింది,మా కాలనీకి వెలుగు కాంతులు నింపారని మా కోసం ఎంతో కృషి చేసిన వసంత కృష్ణ ప్రసాద్ ను మేము ఎప్పటికీ మరిచిపోమని ఆయన మైలవరం నియోజకవర్గంలో ఉన్నంతవరకు మేమంతా ఆయన వెంటనే ఉంటామని ప్రజా జ్యోతి పత్రికా ముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగానే కాలనీవాసులు మాట్లాడుతూ ఏ చిన్నపాటి వర్షం పడినా,మా కాలనీ రహదారుల్లో నడవాలంటే నడవలేని పరిస్థితి ఏర్పడిందని,మా కాలనీకి రహదారులు డ్రైనేజీ సౌకర్యాలు లేక పలు ఇబ్బందులు పడుతున్నామని కావున నిరంతరం అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పాలన చేస్తున్న శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ కాలనీ రహదారులను, సిసి రోడ్లు ఏర్పాటు చేయించగలరని అలాగే జాతీయ రహదారి ప్రధాన రహదారి నుండి మా కాలనీ వరకు తారు రోడ్ ను ఏర్పాటు చేయించగలరని ప్రాధేయ పడుతున్నట్లు కాలనీవాసులు పత్రికా ముఖంగా తెలిపారు. అలాగే వచ్చే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో మీ వెంట మేము ఉంటామని మా కాలనీ వసంత కాలనీ గా మార్పు చేసుకుంటామని కాలనీవాసులు పతికాముఖంగా తెలిపారు.ఏది...ఏమైనా కాలనీవాసుల సమస్యలను శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పరిష్కరించాలని కాలనీకి సిసి రోడ్లు నిర్మించాలని కోరుకుందాం...!!!

## తహసీల్దార్ సలీమా ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ విచారణ



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా బాపట్ల మండలం ఈతేరు గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 8లో సోమవారం ఎస్ఐఆర్ విచారణ నిర్వహించారు. తార్కిక వ్యత్యాసాలు, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి నోటీసులు అందుకున్న 139 కేసులను అధికారులు పరిశీలించారు.తహసీల్దార్ సలీమా పర్యవేక్షణలో జరిగిన విచారణకు నోటీసులు అందుకున్న వారు హాజరై వివరణలతో పాటు ఆధార పత్రాలను సమర్పించారు. అధికారులు పత్రాలను ఎన్నికల రికార్డులతో సరిపోల్చి కేసుల వారీగా వివరాలను పరిశీలించారు.ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలను సరిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. విచారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్న అధికారులకు ఈతేరు మండల అధ్యక్షురాలు కాగిత నాగభూషణం కుమారి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామానుజ కూటమి రద్దు ఆర్డర్‌ను పునఃపరిశీలించాలి



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మాకర్లవారి రామానుజ కూటమికి సంబంధించి గతంలో తీసుకున్న అమాల్గమేషన్ ఆర్డర్‌ను రద్దు చేస్తూ కొత్తగా తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని మాజీ ఉపసభాపతి, మాజీ బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. భక్తులు, బాపట్ల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మాకర్లవారి ఆశయాలను కొనసాగించడంతో పాటు శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో గతంలో అమాల్గమేషన్ ప్రక్రియను చేపట్టినట్లు కోన రఘుపతి తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాత రామానుజ కూటమి స్థానంలో ఆధునిక సౌకర్యాలతో భవనాన్ని నిర్మించి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని దేవస్థానం అభివృద్ధి, మాకర్లవారి ఆశయాల సాధనకు ఉపయోగపడేలా రూపొందించినట్లు వివరించారు. కూటమి నిర్వహణలో లోటుపాట్లు ఉంటే ఎండోమెంట్ శాఖ అధికారులు, భక్తులు, సంబంధిత కమిటీలతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. భక్తులకు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వాహకులకు వసతి, ఎండోమెంట్ శాఖ కార్యాలయం, ఫంక్షన్ హాల్ వంటి సౌకర్యాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

**ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలి**

బాపట్లలో భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణాన్ని ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని పూర్తి చేయాలని కోన రఘుపతి కోరారు. అభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలన్నారు.

**సూర్యలంకలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలి**

బాపట్ల పర్యాటక, ఆర్థిక అభివృద్ధికి విమానాశ్రయం కీలకమని పేర్కొన్న కోన రఘుపతి, గతంలో ప్రతిపాదించిన విధంగా సూర్యలంకలోనే బాపట్ల ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాపట్ల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అమాల్గమేషన్ రద్దు వంటి సున్నితమైన ఆధ్యాత్మిక అంశాల్లో మాకర్లవారి కుటుంబ సభ్యులు, భక్తులు, సంబంధిత వర్గాలతో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే తీసుకున్న రద్దు ఆర్డర్‌ను పునఃపరిశీలించే దిశగా ఎమ్మెల్యే, అధికారులు చర్యలు చేపట్టాలని బాపట్ల వాసిగా, శ్రీ భావనారాయణ స్వామివారి భక్తుడిగా కోరుతున్నట్లు కోన రఘుపతి తెలిపారు.

## ఆలమూరులో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ నేడు ప్రారంభం.



**ఆలమూరు ఆగష్టు 24(ప్రజాజ్యోతి):**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రం ఆలమూరు మెయిన్ రోడ్ లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ ఈనెల 25న అనగా ఈరోజు మంగళవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆలమూరు ఎస్సై జి నరేష్ తెలిపారు. పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్,కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,కొత్తపేట డిఎస్పీ సుంకర మురళీమోహన్,రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని ఎస్సై నరేష్ తెలిపారు.

## ఫిర్యాదులపై సత్వర పరిష్కారం జిల్లా ఎస్పీ



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను చట్టపరిధి లో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ మాట్లాడారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, స్థల వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి న ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రతి అర్జీపై విచారణ జరిపి నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ శాఖ పరిధిలో లేని సమస్యలపై సంబంధిత శాఖను సంప్రదించే విధానాన్ని ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఆదేశించా రు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ లక్ష్మిరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## గోలగమూడి వెంకయ్య స్వామి ఆరాధనలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో గాయత్రి అపార్ట్‌మెంట్ పక్కనరోడ్లో గల భగవాన్ శ్రీశ్రీశ్రీ గోలగమూడి వెంకయ్య స్వామి వారి ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మల్లిక, గణేష్ వెంకట్, నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా అన్నవితరణ చేశారు.ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుండి పాత రాయచోటిలో వెలసిన హజ్రత్ సయ్యద్ షా జమాలుద్దీన్ బాషా ఖాదరి బుఖారి (ర.అ) అలైహి ఔలియా అల్లాహ్ వారి దర్గాలో ఉరుసు ఉత్సవాలు



**రాయచోటి ఆగస్టు 24** ప్రజా జ్యోతి రాయచోటి పట్ట ణం పాత రాయచోటిలో వెలసి ఉన్న హజరత్ జమాలు ల్లా బాబా ఉరుసు మహోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. 25వ తేదీ మంగళవా రం గంధం ఊరేగింపుతో ఉరుసు మహోత్సవాలు ప్రా రంభం కానున్నాయి. అదే విధంగా ఈ నెల 26వ తేదీ బుధవారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం.. అదే రోజు సాయం త్రం ఉరుసు ఉత్సవం జరగనుంది. 27వ తేదీ శనివారం తహలీల్ ఫాతేహా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నాయి. ఉరుసు ఉత్సవాలకు హిందూ, మహమ్మదీయ సోదరు లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

# వర్షాభావ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి









**ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి**

**డి సి చైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్**

**ఎల్.ఎల్.సీ నీటి విడుదలకు రైతుల కృతజ్ఞతలు**

**భారీగా తరలివచ్చిన రైతులు**

**పీసీ, డీసీ చైర్మన్లు, రైతు సంఘాల ప్రతినిధులకు ఘన సన్మానం**

**హోళగుంద, ఆగస్టు 24, ప్రజా జ్యోతి న్యూస్** – ఎల్.ఎల్.సీ (తుంగభద్ర దిగువ కాలువ)కు నీటి విడుదల చేసిన సందర్భంగా రైతుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎల్.ఎల్.సి అతిథి గృహం ఆవరణంలో కృతజ్ఞత సభ ఘనంగా నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎల్.ఎల్.సీకి నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, నీటిపారుదల శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీసీ చైర్మన్ టిప్పు సుల్తాన్, డీసీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్, అబ్దుల్ సుభాన్, తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి శేషగిరి, సింగల్ విండో చైర్మన్ విష్ణు రెడ్డి, డైరెక్టర్ దుర్గయ్య,రైతు సంఘాల ప్రతినిధులను నాయకులు తోక వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ....నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు నీటిని పొదుపుగా, అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు.ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం ద్వారా కాలువకు వచ్చిన నీటిని చివరి ఆయకట్టు వరకు సమర్థవంతంగా అందేలా రైతులు సహకరించాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు.రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఎల్.ఎల్.సీకి నీటి విడుదల చేయడం వల్ల సాగునీటిపై ఆధారపడిన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.రైతుల ప్రయోజనాల కోసం ఎల్.ఎల్.సీ నీటి విడుదల విషయంలో చొరవ చూపిన పీసీ, డీసీ చైర్మన్లు, రైతు సంఘాల ప్రతినిధులకు రైతులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ గంగా భవాని సమేత మూలస్థానేశ్వర స్వామి శివాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



**రామాపురం ఆగస్టు 24 ప్రజా జ్యోతి** రామాపురం మండలం హసనాపురం గ్రామంలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి శివాలయ అభివృద్ధికి దాత రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధికి సాధనపు వెంకట రమణ ఆచారి, శ్రీమతి లక్ష్మీదేవి తమ వంతు సహ కారం అందించిన దాతకు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.అనంతరం దాతకు తీర్థప్రసాదాలు అందజేసి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు

## మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం**

**ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి**

**గౌరీదేవిపేటలో పోలీసుల విస్తృత అవగాహన సదస్సు**

**సీఐ ఎం. కన్నపరాజు, ఎస్ఐ జి. అప్పలరాజు వెల్లడి**

**పాల్గొన్న గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము, మాజీ సర్పంచ్ శివకనకరాజు**



గౌరీదేవిపేటలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**ఎటపాక, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాలు, గంజాయి, పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల సమాజంలో ప్రతి ఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలవరం జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం. కన్నపరాజు, ఎటపాక ఎస్ఐ జి. అప్పలరాజు స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని గౌరీదేవిపేట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో ముఖాముఖి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు. సెల్‌ఫోన్ వాడకానికి బానిసలై సమయాన్ని వృథా చేసుకోవద్దని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, తల్లిదండ్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణాల్లో హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటూ, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని కోరారు. బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని వివరించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, గ్రామ ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుతంగా మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీదేవిపేట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు, మాజీ ఉపసర్పంచ్ మడకం నరసింహారావు, చంద్రు రాజా, స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన పెంపొందించాలి





**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం**

**రాయచోటి, ఆగస్టు 24 ప్రజా జ్యోతి** అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనల మేరకు ఏపీ ఎస్ ఏ సి ఎస్ ఎన్ ఎ సి ఓ సహకారంతో రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి.రవి శంకర్ మాట్లాడుతూ, యువత హెచ్ఐవి ఎయిడ్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని అన్నారు. హెచ్ఐవి వ్యాప్తి, నివారణ, హెచ్ఐవి పరీక్షలు, చికిత్సా సేవలపై ప్రతి విద్యార్థి సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా హెచ్ఐవి నియంత్రణలో మంచి ఫలితాలుసాధించవచ్చని తెలిపారు.హెచ్ఐవి ఎయిడ్స్ పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించడంలో యువత కీలక పాత్ర పోషించాలని, తమ కుటుంబాలు మరియు సమాజంలో సరైనసమాచారాన్ని వ్యాప్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై బాధ్యతాయుతమైన వైఖరిని కలిగి ఉండాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి టి.స్వాతి మాట్లాడుతూ, హెచ్ఐవి ఎయిడ్స్ నివారణకు అవగాహన కార్యక్రమాలు ఎంతో కీలకమని తెలిపారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని హెచ్ఐవి పై సరైన సమాచారాన్ని ఇతరులకు చేరవేయాలని కోరారు.హెచ్ఐవి కార్యక్రమంలో నిర్దేశించిన 95-95-99 లక్ష్యాల సాధనకు యువత, విద్యార్థులు మరియు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. హెచ్ఐవి తో జీవిస్తున్న వారిని ముందుగా గుర్తించడం, హెచ్ఐవి నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరినీ చికిత్సా సేవలకు అనుసంధానం చేయడం, చికిత్స పొందుతున్న వారిలో వైరల్ లోడ్‌ను నియంత్రణలో ఉంచడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.అలాగే ఇంటెన్స్ ఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ కార్యక్రమం 8 వారాలపాటు కొనసాగుతోందని, ఇందులో భాగంగా ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12, 2026 వరకు విద్యార్థులు, యువత మరియు ప్రజల్లో హెచ్ఐవి ఎయిడ్స్ పై విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు హెచ్ఐ విరీక్షల ప్రాధాన్యత, హెచ్ఐవి నివారణ, చికిత్సా సేవలు, అపోహల నివారణ మరియు హెచ్ఐవి తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య సేవా సంఘం సిబ్బంది ఓ ఆర్ డబ్ల్యు శ్రీమతి నరసమ్మ, పి ఈ శ్రీమతి ప్రియాంక, అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.యువత ఆరోగ్యంపై బాధ్యత వహిస్తూ, హెచ్ఐవి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కార్యక్రమ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## అశోక్ నగర్ లో మంచూరుకు ఘన స్వాగతం





**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు అశోక్ నగర్, దూదేకుల వీధిలో "రెండేళ్ల కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి" పేరిట ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వార్డులోకి విచ్చేసిన మంచూరు సూర్యనారాయణ రెడ్డికి స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. వార్డులో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు.రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, బద్వేలు నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితవాడల సమస్యలు పరిష్కరించాలి

**బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా**



**బాపట్ల ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ప్రతి దళితవాడకు రెండు ఎకరాల స్మశాన స్థలం కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.దళితవాడల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక శంఖారావంలో భాగంగా బాపట్ల కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ధర్నా శిబిరం వద్దకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వచ్చి నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దళితవాడల్లో కనీస మౌలిక సదుపాయాలు, తాగునీరు, స్మశానవాటికలకు రహదారి, ప్రహరీ వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. జీవో ప్రకారం ప్రతి దళిత గ్రామానికి రెండు ఎకరాల స్మశాన స్థలం కేటాయించాలని కోరారు. బాపట్ల జిల్లాలో ఏళ్లుగా దళితులు సాగు చేస్తున్న సొసైటీ పోరంబోకు, లంక భూములకు పట్టాలు ఇవ్వాలని, ఆన్‌లైన్‌లో లేని సాగుభూములకు ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు.పాత ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సాయం అందించాలని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు జయరాజు, ఎన్.బాబురావు, సిహెచ్. మణిలాల్, పి.కొండయ్య, బి.అగస్టీన్, కే.శరత్‌బాబు, ఎం.కిరణ్, పి.మనోజ్, బి.సుబ్బారావు, ఎం.వసంతరావు, పి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహణ





**రాయచోటి ఆగస్టు 24 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాడు మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ పి. శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అంకితభావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలల యందు నిర్ధారించుకొని తరగతి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో అభ్యసించాలని, కమ్యూనికేషన్ స్మార్ట్ స్కిల్స్ పై పట్టు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అకడమిక్ ప్రాజెక్ట్స్ ను అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని టెక్నాలజీని ఎప్పటికప్పుడు పునఃశ్చరణ చేసుకొని సాంకేతికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే ఈ శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ స్మార్ట్ హ్యాక తాన్ లాంటి టెక్నికల్ ప్రదర్శనలు యందు పాల్గొని వివిధ ఆవిష్కరణలను విశ్లేషించి తదుపరి నవీకరణకు శోధన చేయాలని సూచించారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతోమంది సాఫ్ట్వేర్, బ్యాంకింగ్, ప్రభుత్వ ప్రైవేటు ,అఖిల భారత సర్వీసులు యందు అత్యున్నత హోదాలో స్థిరపడ్డారని యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్ మరియు ప్రతిభ అవార్డులు సాధించారని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను తీర్చే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి ప్రయోగశాలల కు అధిక ప్రాముఖ్యత ఇచ్చిందని, కావున దీనికి అనుగుణంగా మొదటి సంవత్సరం నుండే కోడింగ్ మరియు ప్రోగ్రామింగ్ విభాగాలు యందు ప్రత్యేక శిక్షణ మరియు వనరులు కల్పిస్తున్నామని తెలియజేశారు. మార్కుల కోసం కాకుండా తరగతి అంశాలపై పూర్తిస్థాయిలో విషయపరిజ్ఞానాన్ని విపులంగా బోధించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ తమ కళాశాల శిక్షణ సంస్థలతో ఎంఓయూ ఏర్పరచుకుని 100% ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి సంవత్సరం అపేక్ష లాంటి టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్ మరియు సింపోజియం ద్వారా విద్యార్థుల నైపుణ్యతను మరియు సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సాహాన్ని అందిస్తామని వివరించారు .రెండవ సంవత్సరం నుండి ఉద్యోగ అవకాశాల కోసం కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల యాజమాన్యం అతిథిని సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ. నరేష్, మేనేజ్మెంట్ ప్లేస్మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్, ఏఐ డీఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి. సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాయచోటి జిల్లా కేంద్రాన్ని తిరిగి ఇవ్వాలి.. రాయచోటి ప్రజల మనోభావాలను గౌరవించాలి

గెజిట్ ఉన్నా.. రాయచోటిని జిల్లా కేంద్రం ఎందుకు తొలగించారు?

ప్రెసిడెన్షియల్ గెజిట్ తర్వాత మార్పు ఎలా సాధ్యం? జీవో 54లో 26 జిల్లాలే మరి 28 జిల్లాల ముచ్చట ఎందుకు?

రాయచోటిపై ఎందుకంత వివక్ష హెచ్ఆర్ఏ రద్దు జీవో 78ను తక్షణమే ఉపసంహరించాలి

రైతు, ఉద్యోగి, యువత, విద్యార్థి ప్రయోజనాల కోసం అహర్నిశలు పోరాడుతా

రాయచోటిలో జరిగిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి





**రాయచోటి ఆగస్టు 24 ప్రజా జ్యోతి** రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటైన రాయచోటిని అభివృద్ధి పథం లోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని అర్థాంతరంగా తొలగించడం ఈ ప్రాంత ప్రజలపై జరిగిన తీవ్ర అన్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం రాయచోటి పట్టణం ఎస్ ఎన్ కాలనీలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని, రాయచోటి జిల్లా కేంద్రాన్ని తిరిగి యథాతథంగా కొనసాగించే వరకు ప్రజల తరఫున పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. అన్ని రకాలుగా వెనుకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లా కేంద్రం ద్వారా కొంచెం ముందుకు తీసుకెళ్దామనే ఆలోచనతో తాము జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తే, దాన్ని ఎటువంటి డాక్యుమెంటేషన్ లేకుండా అర్థాంతరంగా తీసివేయడం జరిగిందన్నారు. అందుకే మరొక్కసారి దీనిపైన గట్టిగా డిమాండ్ చేయాలని, ఎక్కడికి వెళ్లినా కూడా ప్రతి ఒక్కరిలో ఆ బాధ కలుగుతుంది కాబట్టి ప్రజల తరఫున మరొక్కసారి గట్టిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**జీవో 54లో 26 జిల్లాలే ఉంటే కార్యాలయాల తరలింపు ఎందుకు?జీఓ లకు విలువలేదా?**

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏప్రిల్ 4, 2022న రాయచోటి ఏర్పడిందన్నారు. దీనికి పూర్తిగా గెజిట్ ఎటువంటిది లేదు కాబట్టి మార్చేశాము అనే మాటను కొంతమంది తెలిసి తెలియక మాట్లాడుతున్నారన్నారని,గతంలో మీరు ఆ గెజిట్ తీసుకురాకపోవడం వల్లే మార్చామని మాట్లాడు తున్నారన్నారు .2023 వ సంవత్సరం జనవరిలో అప్పటి ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో గెజిట్ కోసం కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు.ఆ గెజిట్‌ని అంగీకరిస్తూ 26 జిల్లాలను అలాగే రాయచోటిని అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్స్‌గా ఆమోదిస్తూ, డిసెంబర్ 15, 2025న ప్రెసిడెన్షియల్ గెజిట్ వచ్చిందన్నారు. మరి ఈ జిల్లాలని మళ్లీ రాయచోటి హెడ్‌క్వార్టర్స్‌గా తీసేస్తూ, 28 జిల్లాలుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 30న ఆర్డర్ ఇచ్చిందని, 31వ తేదీకి అన్ని షిఫ్ట్ అయిపోవాలని చెప్పి, 28 జిల్లాలుగా చేసినట్టుగా డిసెంబర్ 30, 2025న జిఓ ఇచ్చిందన్నారు. 2025 డిసెంబర్ 15న ప్రెసిడెన్షియల్ ఆర్డర్ వచ్చాక, ఇక పూర్తిగా డిస్ట్రిక్ట్ అనేది అన్ని రంగాలలో పూర్తి అనుమతులు పొందిన తర్వాత, ప్రతిదీ అనుమతి పొందిన తరువాత ఎందుకు మార్చారు అని ఆయన ప్రశ్నించారు. జనవరి 1, 2026 నుంచి పాపులేషన్ సెన్సస్ జీవోలో ఎటువంటి పంచాయతీ బోర్డర్స్ గానీ, వార్డ్స్ బోర్డర్స్ గానీ, జిల్లాల బోర్డర్స్ ఏదీ జరగకూడదు అనే జీవో యాక్టివ్‌గా వస్తుందని చెప్పి 31న మార్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 28 జిల్లాలు చేసిన తర్వాత, ఆ 28 జిల్లాలకు ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఇవ్వాలి కదా? మళ్లీ రీసెంట్‌గా ఏప్రిల్ 26, 2026న జీవో నంబర్ 54 వాళ్లే ఇచ్చారని, జీవో నంబర్ 54లో 26 జిల్లాలనే గుర్తిస్తూ, వాళ్లు ఇచ్చినట్టు 28 జిల్లాలుగా కాదు, 26 జిల్లాలుగానే గుర్తిస్తూ దానికి ప్రకారంగా ఉద్యోగుల బైఫర్కేషన్స్ జరగాలని, లోకల్ క్యాడర్స్ అన్నీ కూడా దాని ప్రకారమే జరగాలని చెప్పి వాళ్లు జీవో ఇవ్వడం జరిగిందన్నారు. జీవో నంబర్ 54లో, ఏదైతే 2023లో అప్పటి ప్రభుత్వం పంపించిందో దాన్ని యథాతథంగా ఆమోదించిందన్నారు. మల్టీ జోన్ 1, మల్టీ జోన్ 2 గా రాష్ట్రాన్ని రెండు మల్టీ జోన్లుగా డివైడ్ చేసి, జోన్ 1, జోన్ 2, జోన్ 3 గా విభజించి శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు, కృష్ణా జిల్లా కింద నుంచి రాయలసీమ అన్ని ప్రాంతాలకు మల్టీ జోన్ 2 కింద ,జోన్ 4, జోన్ 5, జోన్ 6. అందులో భాగంగా జోన్ 5 కింద అన్నమయ్య జిల్లా వచ్చేటట్టుగా, దీని ప్రకారమే ఉద్యోగులను కేటాయించవలసిందిగా క్లియర్‌గా జీవో నంబర్ 54లో అన్ని రకాల ఏ పోస్టులు ఏ క్యాడర్‌లో పెట్టాలి, ఏ జోన్‌లో ఎవరు ఉండాలి అనేటువంటిది ఇచ్చినటువంటి జీవో ఇదన్నారు.మరి అటువంటప్పుడు మీరు ఏర్పాటు చేసినటువంటి 28 జిల్లాలకు మీరే గుర్తించనప్పుడు, మీరు ఇచ్చిన 54 జీవో నంబర్‌లో, ఏప్రిల్ 26, 2026న ఇచ్చినటువంటి జీవోలోనే మీరు ఇచ్చినటువంటి 28 జిల్లాలు లేనప్పుడు, పాత జిల్లాలు కొనసాగుతున్నట్లే కదా? మరి అటువంటప్పుడు రాయచోటిలో ఉన్నటువంటి జిల్లా కార్యాలయాలన్నింటినీ ఎందుకు తరలించాల్సి వస్తోందని ప్రశ్నించారు.దీనిపైన ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదేదో ఒకరిది ఇంకొకరిదో కాదని, ఇంకొకరి మనోభావాలనో, ఇంకొకరి జిల్లాలనో నేను తీసుకోవాలని కాదు, నా ప్రాంతం నాకు ముఖ్యం. ఈ ప్రాంతం యొక్క ప్రజల సెంటిమెంట్స్‌ను నేను చూశాను కాబట్టి, ఈ ప్రాంతం యొక్క ప్రజల మనసును నేను చూశాను కాబట్టి, వాళ్లు ఏది కోరుకుంటున్నారో నేను గమనించాను కాబట్టి, వాళ్లకు అండగా నిలబడడం కోసమే ఈ విషయాలు తెలియజేస్తున్నానన్నారు.ఇది ఇంత క్లియర్‌గా ఉన్నప్పుడు, ఈ రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చినప్పుడు, దాన్నే వాళ్లు 28 జిల్లాలుగా గుర్తించకుండా 26 జిల్లాల కిందే ఇచ్చినప్పుడు, ఎందుకు రాయచోటి నుంచి ఆఫీసులను తరలిస్తున్నారు? సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. దీనిపైన పూర్తిస్థాయిలో ఆ జీవోస్ కోట్ చేసి, ఏ రకంగా బైఫర్కేషన్ చేసింది వాళ్లన్నీ, ఏ రకంగా జీవోలు ఇచ్చిందో అన్నీ కూడా మెన్షన్ చేసి, ఇవన్నీ మన ఫైనాన్స్ సెక్రటరీకి, చీఫ్ సెక్రటరీకి రిప్రజెంటేషన్ రూపంలో తయారుచేసి పంపిస్తున్నాను రాయచోటి ప్రజల తరఫున అని వెల్లడించారు.దీంట్లో ఏ రకంగా చిట్వేలుకి కోడూరుక సంబంధించింది గానీ, ఇటు పక్క ఏది కూడా అన్నమయ్య జిల్లాలో భాగంగానే ప్రభుత్వం గుర్తించింది. దాని ప్రకారమే ఉద్యోగులను బైఫర్కేట్ చేయాలని చెప్పి, మరి ఎందుకు ఆ రకంగా చేయకుండా, పోస్టింగులు లేకుండా వేరే జిల్లాలకు ఇక్కడి నుంచి ఈ ప్రాంతానికి రావలసినటువంటి ఎంప్లాయీస్‌ను వేరే జిల్లాలకు అలాట్ చేస్తా ఉంటే, ఎందుకు ఈ కలెక్టర్లు గానీ, మిగతా అధికారులు అంతా నోరు మెదపట్లేదు అని ప్రశ్నించారు.మీకు జీవోలు అన్నా, గెజిట్లు అన్నా, వ్యవస్థలు అన్నా గౌరవం లేకుండా పోవడమా? రాజ్యాంగానికి సంబంధించినటువంటి అంశాలను కనీసం మీరే గుర్తించకపోతే, పైస్థాయి అధికారులు ఇంక ఈ వ్యవస్థను ఎందుకు నమ్మాలి? ఈ సిస్టమ్స్‌కి ఎందుకు రెస్పెక్ట్ ఇవ్వాలి? అని ప్రశ్నించారు.ఇది అన్యాయం కాదా? రాష్ట్ర విభజన జరిగినప్పుడు గుండెలు పగిలేలా బాధపడ్డామని, ఏర్పడినటువంటి జిల్లా కేంద్రాన్ని తరలించి మీరు పొందుతున్న ఆనందం ఏంటో నాకు తెలియదన్నారు. కనీసం మీ ప్రభుత్వం ఇచ్చినటువంటి, మీ ప్రభుత్వంలో హెడ్స్ ఇచ్చినటువంటి జీవోనే మీరు గౌరవించకుండా, దాన్నే పాటించకుండా పోతే ఏ రకంగా మీకు ఇది వస్తుంది? ఇవన్నీ కూడా క్లియర్ కట్‌గా రాబోయే రిప్రజెంటేషన్స్ రూపంలో చీఫ్ సెక్రటరీకి, ఫైనాన్స్ సెక్రటరీకి కూడా అన్నీ పంపించడం జరుగుతుందని, దాన్ని మళ్లీ కూడా యథాతథంగా కొనసాగించే విధంగా అన్ని రకాల గ్రౌండ్స్ కూడా ఉన్నాయి మీరు ఇచ్చిన జీవోల ప్రకారమేనని. కాబట్టి దీన్ని మరొకసారి మీరు గుర్తించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాయచోటి ప్రాంత ప్రభుత్వోద్యోగులకు హెచ్ఆర్ఏకు కోత.. వేలాది ఉద్యోగులపై ప్రభావం అందులో భాగంగా ఇవన్నీ జీవోలు ఫోర్స్‌లో ఉండగానే, రాయచోటి పట్టణ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రభుత్వోద్యోగులకు అకస్మాత్తుగా హెచ్ఆర్ఏ అనేటువంటిది లేకుండా తీసేయడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వేలాదిమందికి సంబంధించినటువంటి సెంటిమెంట్ అనేది కూడా మీరు ఆలోచన చేయకుండా, మొన్న రీసెంట్‌గా మీరు నిర్దాక్షిణ్యంగా జీవో ఎంఎస్ 78 ఇచ్చారన్నారు. మీరు ఇచ్చినటువంటి ఏప్రిల్ 26, 2026 న ఇచ్చినటువంటి జీవోలో మీరే ఇచ్చారు, 26 జిల్లాలకే ఉంది, మేము చేసినటువంటి 28 జిల్లాలకు శానిటీ లేదు అన్నట్టుగా మీరే జీవో ఇచ్చారు. మరి జీవో నంబర్ 78 లో మీరేమిచ్చారు? రాయచోటికి సంబంధించిన ఎ=రా పాలసీ తీసేస్తామని మాట్లాడారని, అంత చులకనా ఈ ప్రాంతం అంటే మీకు? ఏం తప్పు చేశాం మేము? అని ప్రశ్నించారు.ఎక్కడైనా జరిగిందా దేశంలో ఇట్లా? దాదాపుగా ఇటు సంబేపల్లె వరకు, ఇటు చిన్నమండెం వరకు, ఇటు మట్లి వరకు, ఇటు రామాపురం వరకు దాదాపు 11 కిలోమీటర్ల పైగా రేడియస్‌లో నివసించేటటువంటి ప్రతి ఒక్క ఉద్యోగులు, ప్రతి డిపార్ట్‌మెంట్ అది పోలీస్ వ్యవస్థలో పనిచేసే వ్యక్తి గానీ, రెవెన్యూలో పనిచేసే వ్యక్తి గానీ, టీచర్‌గా పనిచేసే వ్యక్తి గానీ వీళ్లందరూ ఉద్యోగులకు సంబంధించి దాదాపుగా 1,500 నుంచి 2,000 మందికి పైగా ఉన్నటువంటి వాళ్లకు ఎ=రా తీసేస్తే, ప్రతి ఒక్క మనిషికి మినిమం రూ. 4,000 నుంచి రూ. 10,000 వరకు పైగా నష్టం ఉంటుందన్నారు, బేసిక్ శాలరీ నుంచి పోయేటటువంటి పరిస్థితి వాళ్లకు ఏర్పడింది అంటే ఎంత బాధాకరం? ఇది మా ప్రాంతానికి నష్టం కాదా? మా వాళ్లకు నష్టం కాదా? అని ప్రశ్నించారు. అది కూడా తెలిసి తెలియని కొంతమంది ఉద్యోగ సంఘ నాయకులు వాళ్లకు మరి పూర్తిగా దీన్ని స్టడీ చేయాలనుకుంటారో, ఏదైనా మాట్లాడేటప్పుడు ఒక మనిషిని రిప్రజెంట్ చేసేటప్పుడు, ఒక మనిషి ఆవేదన వినకుండా, కనీసం ఇంకిత జ్ఞానంతో ఫైట్ చేద్దాం అనేటువంటి ఇది కూడా లేకుండా, ఇది గ్రేడ్ 1 మున్సిపాలిటీ కాబట్టి జిల్లా హెడ్‌క్వార్టర్స్ పోతే పోయింది అని కొంతమంది మాట్లాడడం దురదృష్టకరమని,ఇది స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ అని తెలుసుకోవాలన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

– ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్




**ఎమ్మిగనూరు, ఆగస్ట్ 24(ప్రజా జ్యోతి ):** గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ యాదవ్,సీపీఐ నాయకులు జి.రంగన్న, మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేదల హక్కు అని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి కనీసం 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పనులను విస్తరించి చెరువులు, కాలువలు, రహదారులు, నీటి సంరక్షణ వంటి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఇల్లు లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మద్దిలేటి నాయుడు, రాజీవ్, ఏఐటీయూసీ నాయకులు వీరేష్, తిమ్మ గురుడు, విజయేంద్రతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ భేటీ



**ఎమ్మిగనూరు, ఆగస్ట్ 24(ప్రజా జ్యోతి ):** కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు గారిని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని సాగు, తాగునీటి అవసరాలు, పెండింగ్ నీటి ప్రాజెక్టులపై చర్చించడం జరిగింది.రైతులకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే లక్ష్యంగా అవసరమైన చర్యలపై మంత్రిగారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. మంత్రి నీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని తెలిపారు

## ఎర్రకోట గ్రామానికి కాలువ నీరు విడుదల 2,800 ఎకరాలకు సాగునీరు అందించిన కూటమి ప్రభుత్వం



**ఎమ్మిగనూరు, ఆగస్ట్ 24(ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు మండలం ఎర్రకోటలోని ఎం ఎస్ పి 1ర్ కాలువకు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి సాగునీటిని విడుదల చేశారు. ఈ కాలువ ద్వారా సుమారు 2,800 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. వర్షాభావం, ఎల్నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు నీరు విడుదల చేయడం ఊరట నిచ్చింది.రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు కాలువకు నీరు రావడంపై హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు, మార్కెట్ చైర్మన్ గురువు మల్లయ్య, ఎల్ ఎల్ సి డి ఈ, ఏ ఈ లు,రైతులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా ఏటిఏ అధ్యక్షులు గా సరియం అనిల్ కుమార్ ఎన్నిక




**కూనవరం ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి )** స్థానిక రంపచోడవరం నందు జరిగిన ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ విస్తృతస్థాయి జిల్లా సమావేశంలో పోలవరం జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగానూతన కమిటీ లో అధ్యక్షులుగా కూనవరం మండలం నకు చెందిన సరియం అనిల్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ "ఏజెన్సీ ప్రాంతం ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టం" చేయడం ద్వారా మాత్రమే ఏజెన్సీ ప్రాంతంలో ఐదవ షెడ్యూల్ అనుసరించి వివిధ రకాల పోస్టులను ఏజెన్సీ వాసులతో భర్తీ చేయడానికి వీలవుతుందని తెలియజేశారు. ఇప్పటికే వివిధ శాఖల్లో బక్తిలను జీవనం రాత్రి కొట్టి వేయడం ద్వారా ఆదివాసీలు నష్టపోయారని తక్షణమే న్యాయం చేసే విధంగా ప్రభుత్వాన్ని చట్టం చేయాలని కోరారు. అదేవిధంగా నూతన పోలవరం జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పోరాడేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆధునిక విద్యావ్యవస్థలో వచ్చేటటువంటి వివిధ మార్పులను ప్రభుత్వం తెచ్చే సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులను చైతన్యపరిచి ఆదివాసీ ప్రాంతాలలో మెరుగైన విద్య బోధన జరిగేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

# ‘ఇరుముడి’ బాక్సాఫీస్ ప్రభంజనం.. 2026లో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన తెలుగు సినిమా!




మాస్ మహారాజా రవితేజ నటించిన ‘ఇరుముడి’ బాక్సాఫీస్ వద్ద తన జోరును ఏమాత్రం తగ్గించడం లేదు. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి భారీ స్పందన అందుకుంటున్న ఈ ఎమోషనల్ యాక్షన్ డ్రామా.. వరుసగా రికార్డులు బద్దలు కొడుతూ దూసుకుపోతోంది. ఇప్పటికే తొలి వీకెండ్‌లోనే రూ.80 కోట్ల గ్రాస్ మార్క్‌ను అత్యంత వేగంగా అందుకున్న ప్రాంతీయ చిత్రాల్లో ఒకటిగా నిలిచిన ఈ సినిమా.. తాజాగా మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ‘ఇరుముడి’ 2026లో విడుదలైన తెలుగు సినిమాల్లో తొలి ఆదివారం అత్యధిక మంది ప్రేక్షకులు థియేటర్లకు వచ్చిన చిత్రంగా నిలిచింది. ఫుట్‌ఫాల్స్ పరంగా ఈ సినిమా సరికొత్త రికార్డు నమోదు చేయడం ఇప్పుడు టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ ఘనతను టికెట్ ధరల పెంపు లేకుండానే, అలానే హాలీడేస్ కూడా లేని సమయంలో ఈ ఘనత సాధించడం విశేషం. సాధారణ టికెట్ ధరలతోనే ప్రేక్షకులు భారీ సంఖ్యలో థియేటర్లకు రావడం ‘ఇరుముడి’పై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. సినిమాకు వచ్చిన పాజిటివ్ టాక్, మౌత్ పబ్లిసిటీ ‘ఇరుముడి’కు ప్రధాన బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు సిఫార్సు చేయడంతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య మరింత పెరిగినట్లు తెలుస్తోంది. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషనల్ సన్నివేశాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మంచి స్పందన లభిస్తోంది. దీంతో కేవలం ఓపెనింగ్ వీకెండ్‌కే పరిమితం కాకుండా.. లాంగ్ రన్‌లోనూ సినిమా భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వరుస రికార్డులతో దూసుకుపోతున్న ‘ఇరుముడి’.. రవితేజ కెరీర్‌లో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా పయనిస్తోంది. ఇప్పటికే ఓపెనింగ్ వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా.. సోమవారం నుంచి కూడా బాక్సాఫీస్ వద్ద అదే జోరును కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రేక్షకుల సపోర్ట్ ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఈ సినిమా మరిన్ని బాక్సాఫీస్ మైలురాళ్లను అందుకోవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ‘ఇరుముడి’ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ఎమోషన్, యాక్షన్ అంశాలను సమతూకంగా మేళవిస్తూ ఆయన తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రవితేజతో పాటు సినిమాలో సాయి కుమార్, ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషించారు.మొదటి వీకెండ్‌లోనే రూ.80 కోట్లకు పైగా గ్రాస్ సాధించడం, ఇప్పుడు 2026లో అత్యధిక తొలి ఆదివారం ఫుట్‌ఫాల్స్ నమోదు చేసిన తెలుగు చిత్రంగా నిలవడం ద్వారా ‘ఇరుముడి’ బాక్సాఫీస్ రన్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.




# సర్దార్ 2 ఫస్ట్ సింగిల్ ఆన్ ది వే.. ఆసక్తి రేకెత్తిస్తోన్న కార్తీ లుక్

కోలీవుడ్ నటుడు కార్తీ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం సర్దార్. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సీక్వెల్ సర్దార్ 2 వస్తుందని తెలిసిందే. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే సర్దార్ 2 లో తంగలాన్ ఫేం మాళవిక మోహనన్, అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సి.ఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రం నుంచి మ్యూజికల్ ప్రమోషనల్ అప్‌డేట్ వచ్చింది. సర్దార్ 2 మీుఅశ్రీఎవవతీఖ ఫస్ట్ సింగిల్‌ను రేపు లాంచ్ చేయనున్నట్టు తెలియజేస్తూ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. పోస్టర్‌లో కార్తీ మురుగన్ శూలాన్ని చేతపట్టుకొని ఉండగా.. మరోవైపు నెమళ్లను చూడొచ్చు. తాజా లుక్ సాంగ్ ఎలా ఉండబోతుందని క్యూరియాసిటీ పెంచేస్తుంది. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీని పాన్-ఇండియా స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సర్దార్ 2ను కథానుగుణంగా కజకిస్తాన్, అజర్‌బైజాన్, జార్జియాలో చిత్రీకరించేలా ప్లాన్ చేసిందట పీఎస్ మిత్రన్ టీం.



# ది ప్యారడైజ్ ప్రమోషన్స్ టైం.. గెట్ రెడీ అంటోన్న నాని టీం..!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని అభిమానులతోపాటు మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ ది ప్యారడైజ్ (౧౧జు ్రూా=ూాణ×ూజు). దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మోహన్ బాబు, తనికెళ్లభరణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన నాని, మోహన్ బాబు పోస్టర్లు, గ్లింప్స్ తోపాటు టీజర్ సినిమాపై హైప్ పెంచేస్తున్నాయి. ది ప్యారడైజ్‌పై ఇప్పటికే రెండు రిలీజ్ డేట్స్‌లో మార్పులు చేశారని తెలిసిందే. ఫైనల్‌గా సెప్టెంబర్ 24న 2026 గ్రాండ్‌గా విడుదల కానుంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదలకు ఇంకో నెల మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో నాని టీం ఇక ప్రమోషనల్ ప్లాన్‌తో బిజీగా మారబోతుందన్న వార్త మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. కీర్తి సురేశ్‌పై వచ్చే స్పెషల్ సాంగ్ త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సాంగ్ లాంచ్‌తో ప్రమోషనల్ ప్లాన్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. తెలుగుతోపాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానున్నఈ మూవీలో నాని నయా అవతార్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పించడం ఖాయమని రషెష్ క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. మొత్తానికి త్వరలోనే నాని టీం ప్రమోషన్స్ షురూ కాబోతున్నాయన్న వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్‌కు గురి చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ జాగా మనదే.. అంటూ గూస్‌బంప్స్ తెప్పించే డైలాగ్‌తో షురూ అయిన ది ప్యారడైజ్ టీజర్లో మే ప్యారే ప్యారడైజ్ వాసియో అంటూ మోహన్ బాబు స్టైలిష్ ఎంట్రీ ఇవ్వగా.. సర్కార్ ఉన్నది ఈ దొరల కోసమా..? జనం కోసమా..? అంటూ సాగే సంభాషణలు.. మరోవైపు చీ అని చీదరించుకునే నలుపురంగే మన జెండా.. కాకే దాని మీద గుర్తు అంటూ..నాని ఓ జాతికి నాయకత్వం వహించే నాయకుడిగా అదిరిపోయే యాక్టింగ్‌తో బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమని టీజర్ చెప్పకనే చెబుతోంది. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్‌లో నటిస్తుండగా.. కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# భూలోకంలో బాయ్స్ వదులుతారా?.. ఫుల్ ఫన్‌గా ట్రైలర్

అల్లరి నరేష్ హీరోగా వస్తోన్న తాజా చిత్రం ‘రంభ ఊర్వశి మేనక’. కామెడీ గోస్ కాస్మిక్ అన్నది ట్యాగ్‌లైన్ ఈ సినిమాకు చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్-- హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్స్, టీజర్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఫుల్ కామెడీని తలపిస్తోంది. ఇంద్రలోకం నుంచి భూలోకానికి వచ్చిన రంభ, ఊర్వశి, మేనక ఎలాంటి ఇబ్బందులు పడ్డారనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కాగా.. ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతమందిస్తున్నారు. ఈ మూవీలో నరేష్ వీకే, వెన్నెల కిషోర్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబరు 4న గ్రాండ్ రిలీజ్ కానుంది.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,